

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

అనకాపల్లి అగ్రికల్చర్, జూలై 15(ఆంధ్రజ్యోతి): రాగల అయిదు రోజుల్లో జిల్లాలో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు తెలిపారు. మంగళవారం పరిశోధనా స్థానంలో జరిగిన వాతావరణ ఆధారిత వ్యవసాయం అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 36.9 నుంచి 37.8 డిగ్రీలు, కనిష్ఠంగా 28 నుంచి 28.7 డిగ్రీల నమోదవుతుందన్నారు. నారుమడి దెబ్బతినకుండా నేలలో పదును చూసుకుని నీటి తడులు ఇవ్వాలని సూచించారు.

కౌలు రైతులకు తప్పని కష్టాలు

- దరఖాస్తు చేసుకున్నా అందని పంట సాగుదారుల హక్కు కార్డులు
- రాయితీపై విత్తనాలు, ఎరువులు దక్కని వైనం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)



జిల్లాలోని కౌలు రైతులకు కష్టాలు తప్పడం లేదు. అనేక మంది కౌలు రైతులకు పంట సాగుదారుల హక్కు కార్డు (సీసీఆర్‌సీ)లు మంజూరుకాక ప్రభుత్వం రాయితీపై అందించే ఎరువులు, విత్తనాలను పొందలేకపోతున్నారు.

జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో పంట సాగుదారుల హక్కు కార్డు (సీసీఆర్‌సీ) కోసం కౌలు రైతులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో 2025-26 సంవత్సరానికి జిల్లా వ్యవసాయాధికారులు ఆరు వేల మంది రైతులకు కార్డులు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రోజులు గడిచిపోతున్నా, కేవలం 983 మందికి మాత్రమే కార్డులు అందజేశారు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇంకా 5,017 మందికి అందజేయాల్సి ఉంది. 2024లో జారీ చేసిన కార్డుల కాల పరిమితి ఆగస్టు నెలతో ముగియనుంది. వాటిని రెన్యువల్ చేయాల్సి ఉంటుంది. వాస్తవానికి ... మిగతా 6వ పేజీలో

కౌలు రైతులను గుర్తించాలి



జిల్లాలో 80 శాతానికి పైగా కౌలు రైతులే ఉన్నారు. గ్రామ సభలు నిర్వహించి అందరికీ కార్డులు అందజేయాలి. ఈకేవైసీతో సంబంధం లేకుండా నిజమైన కౌలు రైతులకు ప్రభుత్వ రాయితీ విత్తనాలు, ఎరువులు పొందేలా, పంట దిగుబడులు అమ్ముకొనే అవకాశం కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన కౌలు రైతులకు పరిహారం అందించాలి. - ఎస్.బ్రహ్మాజీ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

వాహనాల ఫిట్‌నెస్‌కు పాట్లు

సబ్బవరంలోని ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్‌కి వెళ్లాల్సిన పరిస్థితి

- గతంలో రవాణాశాఖ కార్యాలయాల వద్ద ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు
- ఫిబ్రవరి నుంచి అందుబాటులోకి ఏటీఎస్ విధానం
- ఏఎస్ఆర్ జిల్లా, నర్సీపట్నం ఆర్టీవో పరిధిలోని వాహనదారుల అవస్థలు
- అదనపు ఖర్చుకు తోడు రోజంతా వృథా అవుతోందని ఆటో డ్రైవర్ల ఆవేదన
- నర్సీపట్నం ఆర్టీవో పరిధిలో ఏటీఎస్ ఏర్పాటు చేయాలని డిమాండ్



సబ్బవరం సమీపంలోని ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్

నర్సీపట్నం, జూలై 15(ఆంధ్రజ్యోతి): **ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి జిల్లాలకు ఒక్కటే ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) ఉండడం, అది కూడా సబ్బవరానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో అక్కడికి వెళ్లాలంటే ఒక రోజంతా వృథా అయినట్టేనని వాహనదారులు వాపోతున్నారు.**

ఆటోలు, కార్లు, ప్రైవేటు బస్సులు, స్కూల్ బస్సులు, లారీలు రోడ్డుపై తిరగాలంటే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. గతంలో రవాణా శాఖ కార్యాలయాల వద్ద సంబంధిత అధికారులు వాహనాలను తనిఖీ చేసి మేన్యువల్ పద్ధతిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మంజూరు చేసేవారు. అయితే మధ్యవర్తుల ప్రమేయం, అవినీతి లేకుండా, పారదర్శకత కోసం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ప్రభుత్వం ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ (ఏటీఎస్) విధానాన్ని తీసుకొచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లా, అనకాపల్లి జిల్లాకు ఒక్కటే ఏటీఎస్‌ను నిర్వహిస్తున్నారు. సబ్బవరానికి ఐదు కిలోమీటర్ల దూరంలో హైవే పై ఇది ఉంది. ప్రైవేటు పబ్లిక్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో దీనిని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఆధునిక సాంకేతిక యంత్ర పరికరాలతో వాహనాలను తనిఖీ చేసి ఫిట్‌నెస్ పాస్ లేదా ఫెయిల్ అని ధ్రువీకరిస్తారు. ఇది అనకాపల్లి ఆర్టీవో కార్యాలయం పరిధిలో ఉన్న 12 మండలాల వాహన యజమానులకు దగ్గరగా ఉండి వెళ్లి రావడానికి వెసులుబాటుగా ఉంటుంది. ఏఎస్ఆర్ జిల్లాలోని 22 మండలాలు, నర్సీపట్నం ఆర్టీవో కార్యాలయం పరిధిలోని 12 మండలాల వాహన యజమానులకు ఏటీఎస్ దూరం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏఎస్ఆర్ జిల్లాలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి వాహనదారులు సబ్బవరం వెళ్లాలంటే 120 కిలోమీటర్లు దూరం ఉంటుంది. అలాగే నర్సీపట్నం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వెళ్లాలంటే 100 కిలోమీటర్లు దూరం ఉంటుంది.



నర్సీపట్నం పాత బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్

ఆటో డ్రైవర్ల ఇబ్బందులు

నర్సీపట్నం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం పరిధిలో 3300 ఆటోలు, 792 మ్యాక్సీ క్యాబ్‌లు, ప్రైవేటు బస్సులు 82, స్కూల్ బస్సులు 190 ఉన్నాయి. మిగిలిన వాహన యజమానుల కంటే ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్ట్రేషన్ తేదీ నుంచి 15 సంవత్సరాల వరకు వాహనం చెల్లుబాటులో ఉంటుంది. నిర్ణీత గడువులో ఫిట్‌నెస్ చేయించుకోవాల్సి ఉంది. వాహనం కొనుగోలు చేసిన 8 సంవత్సరాల వరకు రెండేళ్లకు ఒకసారి, తరువాత ప్రతీ సంవత్సరం ఫిట్‌నెస్ చేయించాలి. దీని కోసం నర్సీపట్నం చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రతి రోజూ 100 ఆటోలు సబ్బవరం ఏటీఎస్‌కి వెళుతున్నట్టు డ్రైవర్లు ... మిగతా 6వ పేజీలో

సముద్ర ఇసుక తోడేళ్లు

- రేయింబవళ్లు తీరం వెంబడి తవ్వకాలు
- దర్జాగా ట్రాక్టర్లలో తరలింపు
- పట్టించుకోని అధికారులు



లోవపాలెం సముద్రతీరం తీరం వద్ద ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం

రాంబిల్లి, జూలై 15(ఆంధ్రజ్యోతి): **మండలంలో సముద్ర ఇసుకను కూడా అక్రమార్కులు వదలడం లేదు. రేయింబవళ్లు దర్జాగా ట్రాక్టర్లలో తరలించేస్తున్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో యథేచ్ఛగా వీరి ఆగడాలు సాగుతున్నాయి.**

మండలంలోని లోవపాలెం, వాడనర్సాపురం, సీతపాలెం గ్రామాల సమీపంలోని సముద్ర తీరం వెంబడి దర్జాగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా సముద్ర ఇసుకను తరలించేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సముద్ర తీరం వద్ద ఇసుక తవ్వకాలకు దారులు ఏర్పాటు చేసుకొని ఇసుకను తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఇసుకను రూ.3,500 నుంచి రూ.5 వేలు వరకు విక్రయిస్తున్నారు. సముద్ర తీరం వెంబడి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రక్షణగా ఉండే ఇసుక దిబ్బలను కొల్లగొడుతున్నారు. ఇసుకకు డిమాండ్ ఉండడంతో అక్రమార్కుల కన్ను సముద్ర తీరం వెంబడి ఉండే ఇసుక దిబ్బలపై పడింది. ఇరు పార్టీలకు చెందిన నాయకుల హస్తం ఇందులో ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సముద్ర ఇసుక తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వాడనర్సాపురం సముద్ర తీరం వద్ద ఇసుక తవ్వకాలు చేపట్టడంతో ఏర్పడిన గొయ్యి

ఆర్టీసీ బస్టాండ్ల నిర్వహణ అధ్వానం



వర్షమొస్తే మునిగిపోతున్న అనకాపల్లి కాంప్లెక్స్ ఆవరణ

- ఎలమంచిలిలో దుర్గంధంతో ప్రయాణికుల అవస్థలు
- వసతుల కల్పనపై దృష్టి పెట్టని అధికారులు

అనకాపల్లి ఆర్టీసీ బస్టాండ్ జలమయమైన దృశ్యం (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పలు ఆర్టీసీ బస్టాండ్ల నిర్వహణ ఘోరంగా ఉంది. కనీస సదుపాయాలు లేక ప్రయాణికులకు పరీక్ష పెడుతున్నాయి. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నంలో ఆర్టీసీ డిపోలు, అనకాపల్లి, సబ్బవరం, మాడుగుల, చోడవరం, ఎలమంచిలి, మాకవరపాలెం, నర్సీపట్నం, నక్కపల్లి, కృష్ణాదేవిపేట, రావికమతం మండల కేంద్రాల్లో బస్టాండ్‌లు ఉన్నాయి. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన గత ప్రభుత్వం డిపోల్లో, ప్రయాణికులు వేచి వుండే బస్టాండ్‌లలో మౌలిక వసతుల కల్పనపై పెద్దగా దృష్టి పెట్టలేదు. అన్ని ఆర్టీసీ బస్టాండ్‌లను ఆధునికీకరిస్తామని ప్రకటనలు చేసినప్పటికీ ఆచరణలో పెట్టలేదు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్టీసీ బస్టాండ్‌లలో పరిస్థితులు చక్కదిద్దుతారని అంతా భావించారు. కానీ ఈ ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో ఆర్టీసీ బస్టాండ్‌లలో సరైన మౌలిక వసతులు లేక ప్రయాణికులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో టీవీలు అలంకారప్రాయంగా మారాయి. వర్షం వస్తే కాంప్లెక్స్ ప్రవేశ ద్వారం వద్ద వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తుంది. నర్సీపట్నం ఆర్టీసీ డిపోలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎలమంచిలి బస్టాండ్ ఆవరణలో సెప్టిక్ ట్యాంకు నిండిపోవడంతో పరిసరాల్లో బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. పాయకరావుపేట బస్టాండ్ నిర్వహణ బాధ్యతలను కాకినాడ జిల్లా తుని ఆర్టీసీ డిపో అధికారులకు అప్పగించారు. ఇక్కడ మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఒక్క ఫ్యాన్ మాత్రమే పనిచేస్తుంది. పరిసరాల్లో రోడ్డు పనులు ఇటీవలే ప్రారంభించారు. నక్కపల్లి, ఎస్.రాయవరం, అడ్డురోడ్డు, కశింకోట ఆర్టీసీ బస్టాండ్‌లకు బస్సులు వెళ్లేందుకు సరైన రోడ్లు లేవు. ప్రయాణికులు వేచివుండేందుకు, కూర్చోడానికి కనీసం బల్లలు కూడా లేవు. చోడవరం బస్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్వహణ అంతంత మాత్రంగానే వుంది. నీటి కొరత నెలకొనడంతో ప్రయాణికులు ఆరుబయటే మలవిసర్జన చేస్తుండడంతో ... మిగతా 6వ పేజీలో

ఫార్మా ప్రమాదాల్లో వారే బలి

అత్యధికులు 'ప్రొడక్షన్'తో సంబంధం లేని విభాగాలకు చెందినవారు

- ఉత్పత్తి విభాగం ప్రత్యేకంగా ఉండాలన్న నిబంధన బేఖాతరు చేస్తున్న యాజమాన్యాలు
- తెలంగాణలోని సిగాచీలో భారీ ప్రమాదంతో అప్రమత్తమైన అధికారులు
- ఇకపై 250 మంది కార్మికులు దాటితే సేఫ్టీ ఆఫీసర్
- ఇకపై సెన్సార్లన్నీ ఐఓటీతో కనెక్షన్



సాయిశ్రేయాస్ ఫార్మాలో ప్రమాదం జరిగిన టీపీ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు, తదితరులు (ఫైల్ ఫొటో)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఫార్మా కంపెనీల్లో జరిగే ప్రమాదాల్లో మందుల ఉత్పత్తితో సంబంధం లేనివారే పెద్ద సంఖ్యలో చనిపోతున్నారు. నెల క్రితం విశాఖ ఫార్మా సిటీ (రాంకీ)లో సాయి శ్రేయాస్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో మరణించిన ఇద్దరూ ఉత్పత్తి విభాగానికి సంబంధం లేనివారే. గతంలో సాహితీ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో కూడా వేరే విభాగాలవారు ఉన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇలాంటి ప్రమాదాలు చాలా జరుగుతున్నాయి.

నిబంధనల ప్రకారం ఉత్పత్తి చేసే ప్రాంతానికి (ప్రొడక్షన్ బ్లాక్) మిగిలిన విభాగాలు దూరంగా ఉండాలి. అంటే క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎస్యూరెన్స్, పీడీ లేబొరేటరీలు వేరే దగ్గర ఉండాలి. కానీ కంపెనీల యాజమాన్యాలు స్థలం కలసి వస్తుందని అన్నింటినీ ఒక్క దగ్గరే పెడుతున్నారు. దాని వల్ల ఉత్పత్తి జరిగే ప్రాంతంలో ప్రమాదం జరిగితే దానితో సంబంధం లేనివారు కూడా చనిపోతున్నారు. సాహితీ ఫార్మాలో కూడా ఇలాగే జరిగింది. బిల్డింగ్ డిజైన్‌ను ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు సరిగా తనిఖీ చేయకపోవడం, ఉత్పత్తికి అనుమతులు ఇచ్చే ముందు క్షేత్ర పరిశీలనలో కూడా వీటిని పట్టించుకోకపోవడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. తెలంగాణాలోని సిగాచీలో జరిగిన భారీ ప్రమాదం కూడా ఇలాంటిదేనని తేలడంతో ఇప్పుడు అధికారులు అప్రమత్తమై ఉత్పత్తికి సంబంధం లేని విభాగాలను ప్రొడక్షన్ బ్లాక్‌కు దూరంగా ఉంచాలని చెబుతున్నారు.

250 మంది దాటితే సేఫ్టీ ఆఫీసర్ తప్పనిసరి

ఇప్పటివరకూ ఫార్మా కంపెనీలలో వేయి మంది వర్కర్లు ఉంటనే సేఫ్టీ ఆఫీసర్‌ను నియమించుకోవాలనే నిబంధన ఉండేది. ఇటీవల కేంద్రం దానిని సవరించి 250 మంది ఉంటే సేఫ్టీ ఆఫీసర్ ... మిగతా 6వ పేజీలో

పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై ఆరా

ఇంటి పన్ను వసూళ్లపై ఎమ్మెల్యే సమీక్ష

- పంచాయతీ నిధులను వాడుకున్న సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఆదేశం



పంచాయతీలో నిధుల వినియోగం వివరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేజర్ పంచాయతీలో ఇంటి పన్నులు వసూలు చేసి పంచాయతీకి జమ చేయకుండా సొంతానికి వాడుకున్న సిబ్బంది నుంచి నగదు రికవరీకి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీకి మంజూరైన నిధులు, వ్యయంపై ఆయన సమీక్ష చేశారు. పంచాయతీకి ఇంటి పన్నుల రూపంలో వసూలైన నిధులలో సుమారు రూ.14 లక్షలు పంచాయతీకి చెల్లించవలసిన సిబ్బంది, వాటిని చెల్లించకపోవడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సిబ్బందిని నుంచి నిధుల రికవరీకి చర్యలు ... మిగతా 6వ పేజీలో

ఉచిత విద్యుత్‌కు రూ.వేలల్లో బిల్లులా?

- స్మార్ట్ మీటర్లను తొలగించాలంటూ ఆందోళన
- వెంకటాపురం సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు



విద్యుత్ డిమాండ్ నోటీసులను దహనం చేస్తున్న రైతులు

మునగపాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉచిత విద్యుత్ పేరుతో సరఫరా అవుతున్న వ్యవసాయ రంగ మీటర్లకు రూ.వేలల్లో బిల్లులు వస్తున్నాయని రైతులు వాపోయారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తరువాతే ఈ పరిస్థితి వచ్చిందని, వెంటనే వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం వెంకటాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు ఆందోళనకు దిగారు. వెంకటాపురం గ్రామానికి చెందిన కడియం కృష్ణ గోవిందరావు, బలిరెడ్డి రామారావు, సుందరపు కాశీవిశ్వనాథ్ సత్యారావు, కడియం అప్పలనర్సమ్మ, పండూరి తాతయ్య, పండూరి చినఅప్పలనాయుడు, తదితర రైతులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరి మీటర్‌కు రూ.15 వేలు నుంచి పాతిక వేల రూపాయల వరకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ నోటీసులు వచ్చాయని తెలిపారు. ఆగస్టులో బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్లు తొలగిస్తామని హెచ్చరిక కూడా చేశారని చెప్పారు. మాజీ ఉపసర్పంచ్ గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ఇప్పటి వరకు నెలకు రూ.30 చొప్పున మాత్రమే వినియోగంతో సంబంధం లేకుండా విధించే వారన్నారు. గృహాలకు బిగిస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే ఆపాలని ... మిగతా 6వ పేజీలో

మంత్రి నారాయణ పర్యటనను విజయవంతం చేయండి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు


మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి మున్సిపాలిటీలో ఈనెల 16వ తేదీన జరగనున్న రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ పర్యటనను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావుతో కలిసి మంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంత్రి నారాయణ మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో మధ్యాహ్నం 2.30 గంటలకు పర్యటిస్తారన్నారు. ప్రజలను ఆయన నేరుగా సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. ఏడాది పాలనలో సాధించిన విజయాలు, ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను తెలియజేస్తారన్నారు. అనంతరం స్థానిక గురవప్ప కల్యాణ మండపంలో జరిగే నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతారన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని తాతయ్యబాబు కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొర్లి నానాజీ, నేతలు ఆడారి ఆదిమూర్తి, రమణబాబు, గొర్లి బాబూరావు, మజ్జి రామకృష్ణ, నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి పతివాడ చిన్నయ్యనాయుడు పాల్గొన్నారు.

సైనికులను స్ఫూరిగా తీసుకొని పనిచేయాలి

ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు పిలుపు


జంపపాలెం స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

ఎలమంచిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సైనికులను స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు అన్నారు. మంగళవారం ఆయన జంపాలెం, సోమలింగపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలల పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల హోలిస్టిక్ కార్డులను పరిశీలించారు. గత ఏడాది ఉత్తీర్ణత గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం పనిచేయాలన్నారు. సోమలింగపాలెం హైస్కూల్లో ఈ ఏడాది పలు ప్రైవేట్ పాఠశాలల నుంచి 27 మంది విద్యార్థులు చేరడంపై ఉపాధ్యాయులను డీఈవో అభినందనీయమన్నారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో అధిక మార్కులు సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మెటీరియల్‌ను ఆయన అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ఉపాధ్యాయులు బిక్షమూర్తి, ఎస్ఎంసీ చైర్మన్ పి.నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఎలమంచిలిలో మంత్రి నారాయణ పర్యటన

ఎలమంచిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ బుధవారం మధ్యాహ్నం ఎలమంచిలి మున్సిపాలిటీలో పర్యటించనున్నారని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 7వ వార్డులో మంత్రి నారాయణ పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పర్యటిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

గొడిచెర్ల హైస్కూల్‌లో వరల్డ్ యూత్ స్కిల్స్ డే


వరల్డ్ యూత్ స్కిల్స్ డే నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిచెర్ల జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఒకేషనల్ ఎడ్యుకేషన్ విభాగంలో వరల్డ్ యూత్ స్కిల్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎస్‌బీవీ సత్యకుమార్ మాట్లాడుతూ స్కిల్స్ నేర్చుకోవడంతో ఉద్యోగ,ఉపాధి అవకాశాలు బాగుంటాయని చెప్పారు. వృత్తి విద్యా ఉపాధ్యాయురాలు ఎం.సాయి చందు, బి.లలిత వరల్డ్ యూత్ స్కిల్స్ డే గురించి వివరించారు.

ధర్మశ్రీని కలిసిన వైసీపీ నేతలు

మునగపాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన కరణం ధర్మశ్రీని ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మశ్రీని శాలువలతో సత్కరించారు. ధర్మశ్రీని కలిసిన వారిలో వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, షేక్ ఇస్మాయిల్, బొద్దపు శ్రీరామ్మూర్తి, సర్పంచులు కాండ్రేగుల నూకరాజు, సుందరపు తాతాజీ, బొడ్డేడ శ్రీను, భీశెట్టి గంగఅప్పలనాయుడు, ఆడారి కాశిబాబు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి, కొప్పుగొండుపాలెంల్లో పొలం పిలుస్తోంది

రాంబిల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి):కొబ్బరి, జీడితోటల్లో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మేలైన దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారిణి సి.సుమంత అన్నారు. మంగళవారం మండలంలోని రాంబిల్లి, కొప్పుగొండుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ కొబ్బరి, జీడి తోటల్లో మొక్కకి 50 గ్రాములు చొప్పున జింక్, బోరాన్ వేయడం ద్వారా పూత, పిందె రాలడాన్ని అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, శ్రీనివాస్, కుమారి, పైడికొండ, కోటేశ్వరరావు, వీఏఏ అనీల్, వీహెచ్ఏ గగన్, రైతులు పాల్గొన్నారు.

ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు వద్దంటూ సీపీఎం ఆందోళన

అచ్యుతాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము డిమాండ్ చేశారు. మంగళవారం పూడిమడకలో ఇంటింటికీ వెళ్లి స్మార్ట్ మీటర్లపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఈ ఏడాదిలో రూ. 15,485 కోట్లు సర్దుబాటు చార్జీలను ప్రజల నుంచి అదనంగా వసూలు చేసిందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల గతంలో కన్నా ఎక్కువ బిల్లులు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో చేపల తాతలు, కె. సోమునాయుడు, సీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నిక

- ఎన్నిక వాయిదా పడే అవకాశం?
- ఎంపీపీగా కొనసాగేందుకు బొలిశెట్టి యత్నం
- అధ్యక్ష ఎన్నికకు ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకుండా ఉండేలా సన్నాహాలు

ఎస్.రాయవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల అధికారిణి కె.మనోరమ ఆధ్వర్యంలో మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. ఎంపీపీ కేసుబోయిన వెంకటలక్ష్మి వ్యక్తిగత కారణాల రీత్యా గత నెల 6వ తేదీన రాజీనామా చేయడంతో తాత్కాలిక ఎంపీపీగా వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు నియమించారు. అయితే బుధవారం జరగనున్న ఎంపీపీ ఎన్నిక వాయిదా పడే అవకాశం ఉంది. ఎంపీటీసీ ఎన్నికల్లో మొత్తం 21 స్థానాలకు గాను 17 మంది వైసీపీకి చెందిన వారు ఎంపీటీసీలుగా గెలుపొందారు. వీరిలో బొలిశెట్టి గోవిందరావుతో పాటు అతడి భార్య శారదాకుమారి ఎంపీటీసీలుగా విజయం సాధించారు. గెలుపొందిన వారంతా బొలిశెట్టి గోవిందరావు మద్దతుదారులే కావడంతో అప్పట్లో తన భార్య శారదాకుమారిని ఎంపీపీగా ఏకగ్రీవం చేయించుకున్నారు. తరువాత పలు రాజకీయ కారణాలతోపాటు ఇతర కారణాల రీత్యా శారదాకుమారి తన పదవికి రాజీనామా చేశారు. అనంతరం జరిగిన ఎన్నికలో వైస్ ఎంపీపీగా ఉన్న కోన లోవలక్ష్మి ఎంపీపీ ఏకగ్రీవంగా ఎన్నికై కొన్నాళ్ల తరువాత వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేశారు. దీంతో వైస్ ఎంపీపీగా-2 ఉన్న చోడిపల్లి అప్పలరాజుకు ఎంపీపీ బాధ్యతలు అప్పగించారు. ఆ తరువాత ఎంపీటీసీ సభ్యుడు బొలిశెట్టి గోవిందరావు వైస్ ఎంపీపీ బాధ్యతలను చేజిక్కించుకున్నారు. తరువాత ఈ ఏడాది మార్చి 27 తేదీన జరిగిన ఎన్నికలో కేసుబోయిన వెంకటలక్ష్మి ఎంపీపీగా ఏకగ్రీవం కాగా.. కొద్ది నెలల్లోనే ఆమె కూడా వ్యక్తిగత కారణాల రీత్యా తన పదవికి రాజీనామా చేశారు. మరలా ఎన్నిక నిర్వహించే వరకు ఎంపీపీ-2గా ఉన్న గోవిందరావుకు ఎంపీపీ బాధ్యతలు అప్పగించారు. అయితే తాత్కాలింగా వచ్చిన ఎంపీపీ పదవిలో తానే కొనసాగడం కోసం వైసీపీ ఎంపీటీసీలంతా తనకే మద్దతుగా ఉండడంతో గోవిందరావు రాజకీయ ఆట ప్రారంభించారు. బుధవారం జరగనున్న ఎంపీపీ ఎన్నికకు తన మద్దతుదారులు హాజరు కాకుండా చేసి ఎన్నిక వాయిదా పడేలా సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని ఇప్పటికే తన మద్దతుదారుల వద్ద గోవిందరావు ప్రస్తావించినట్టు తెలిసింది. దీంతో ఎంపీపీ ఎన్నిక వాయిదా పడుతుందని ప్రచారం జరుగుతోంది. ఇదిలావుంటే బుధవారం జరిగే ఎంపీపీ ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

- రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు


అచ్యుతాపురం మండలం భోగాపురంలో ప్రజలకు కరపత్రాలు అందజేస్తున్న ప్రగడ నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు

అచ్యుతాపురం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సుపరిపాలన సాధ్యమని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం భోగాపురం, చోడపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను సక్రమంగా అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేవా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్, నాయకులు పతివాడ చిన్నంనాయుడు, ధర్మిరెడ్డి నాయుడు బాబు, పుర్రె శ్రీనివాస యాదవ్, దేశంశెట్టి వెంకటరమణ, కూండ్రపు వెంకటరావు, బీఏ రమణ, రాజాన అప్పలనాయుడు, లాలం ప్రసాద్, కర్రి రమణ, లాలం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, మాజీ అధ్యక్షుడు ఇత్తంశెట్టి జారులు అన్నారు. మంగళవారం మండలంలోని పులపర్తిలో వారు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఏడాది పాలనలో సీఎం చంద్రబాబు నాయుడు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాసరావు, నాయకులు పులి దేముళ్లు, కొలగాని నాగేశ్వరరావు, గణేష్, గంజి శంకర్, లోవ తదితరులు పాల్గొన్నారు.


ఎలమంచిలి: పులపర్తిలో మహిళకు పథకాలు, అభివృద్ధి పనులపై కరపత్రాన్ని అందజేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

నక్కపల్లిలో..

మండలంలోని గొడిచెర్ల, పెదతీనార్ల గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలను మంగళవారం కూటమి నాయకులు నిర్వహించారు. గొడిచెర్లలో మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా తిరిగి ఏడాదిలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బొండాడ రవి శంకర్, కోనేటి నాగు, బొండాడ, జగదీశ్వరరావు, కక్కుల లోవరాజు, టెక్ రాజేశ్, తాతబాబు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు. పెదతీనార్లలో ఎంపీటీసీ సభ్యుడు మేరుగు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ గోసల చినతాతారావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నక్కపల్లి సొసైటీ చైర్‌పర్సన్‌గా బుజ్జి


హోం మంత్రి అనితకు బొకేను అందజేస్తున్న కొప్పిశెట్టి బుజ్జి

నక్కపల్లి,జూలై 15 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి నియమితులయ్యారు. హోం మంత్రి అనిత సిఫార్సుతో నక్కపల్లి పీఏసీఎస్‌కు కొప్పిశెట్టి బుజ్జి చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు నక్కపల్లికి చెందిన బీజేపీ నేత కోసూరి శ్రీనివాసరావు, ఎన్.నర్సాపురం గ్రామానికి చెందిన మనబాల కొండబాబును డైరెక్టర్లుగా నియమించారు. తనకు ఈ అవకాశం కల్పించిన హోం మంత్రికి బుజ్జి కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు సకాలంలో సేవలందిస్తూ, సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఆయన్ని కూటమి నాయకులు, అధికారులు, సర్పంచులు అభినందించారు.

కొరుప్రోలు సొసైటీ చైర్‌పర్సన్‌గా రామకృష్ణ


గుర్రం రామకృష్ణ

ఎస్.రాయవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌గా అడ్డరోడ్డు తిమ్మాపురం గ్రామానికి చెందిన గుర్రం రామకృష్ణ నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పనిచేసిన రామకృష్ణ సేవలను గుర్తించి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారు. రామకృష్ణకు పలు గ్రామాలకు చెందిన కూటమి నాయకులు శుభాకాంక్షలు తెలియజేసి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ హోం మంత్రి అనిత తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సహకార సంఘం అభివృద్ధి కృషి చేస్తానన్నారు.

తంగేడు విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీలు


విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

కోటవురట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగేడు విత్తన ప్రాసెసింగ్ యూనిట్‌లో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. మంగళవారం వ్యవసాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా క్వాలిటీ కంట్రోలర్ మహరాజన్, విజిలెన్స్ అధికారి సింహాచలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. అన్ని పరికరాలు సక్రమంగా ఉండాలని, ఎప్పటికప్పుడు రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయాలని సూచించారు. రాసేవిధంపై పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఆఫీసు క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ సరోజని, పాయకరావుపేట ఏడీఏ ఉమాప్రసాద్, స్థానిక ఏవో సరోజని. యూనిట్ సభ్యుడు శివ పాల్గొన్నారు.

ఉప ముఖ్యమంత్రిపై ఫేక్ ప్రచారాలు తిప్పి కొట్టండి : బోడపాటి శివదత్

నక్కపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని జనసైనికులు తిప్పి కొట్టాలని రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. డిప్యూటీ సీఎం పవన్‌కు పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వ లేక వైసీపీ నేతలు దుష్ప్రచారాన్ని చేస్తున్నారని ఆరోపించారు. త్వరలో తమ నాయకుడు నటించిన వీరమల్లు చిత్రం రిలీజ్ కానున్న తరుణంలో కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అటువంటి తప్పుడు ప్రచారం చేసే వారి వివరాలు కూడా సేకరిస్తున్నామన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

పాయకరావుపేట రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేశవరం, రాజవరం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వ్యవసాయ భూములను పరిశీలించి రైతులకు నారుమడి యాజమాన్యం, విత్తనశుద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు పంటలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామగోవిందు, శాస్త్రవేత్త శ్రీహరి, టీడీపీ నాయకులు బొంది కాశీవిశ్వనాథం, ఎంపీఈఓ శరత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా వెంకటరమణ



వంకా వెంకటరమణ, దేవవరపు ఆనంద్, గొల్లపల్లి నాగులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వెంకటనగరం పంచాయతీ సర్పంచ్ వంకా వెంకటరమణ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు వంకా వెంకటరమణను తాండవ నది అవతల ఉన్న అన్ని పంచాయతీలకు పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్టు ప్రకటించారు. అదేవిధంగా నది ఇవతలి పంచాయతీలకు టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిగా మంగవరం గ్రామానికి చెందిన దేవవరపు ఆనంద్‌ను, తెలుగు యువత మండల అధ్యక్షునిగా పాయకరావుపేటకు చెందిన గొల్లపల్లి నాగుని నియమిస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం కొత్తగా నియమితులైన వంకా వెంకటరమణ, దేవవరపు ఆనంద్, గొల్లపల్లి నాగులను టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెల రాజబాబు తదితరులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరీ, జూరెడ్డి ప్రసాద్, ఎం.రమాకుమారి, కురందాసు శివ, సూరా సుబ్రహ్మణ్యం, కశింకోట సత్తిబాబు, తలారి రాజ తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేకు రైతులు సహకరించాలి

- తహశీల్దార్ పి.సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సత్యనారాయణ

మునగపాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో చేపట్టనున్న భూ సర్వే కార్యక్రమానికి రైతులు సహకరించాలని తహశీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. మండలంలో నారాయుడుపాలెంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుళ ప్రయోజనార్థం ప్రభుత్వ ఆదేశాల మేరకు 500 నుంచి 1000 ఎకరాలు స్థలం కోసం సర్వే చేపట్టనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్వో, సర్వేయర్లు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి సబ్బి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు, పెదగుమ్ములూరు సబ్ స్టేషన్ల పరిధిలో గల పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలను నరికివేతకు గుడివాడ, గుర్రాజుపేట, లక్ష్మీపతిరాజుపేట, పెదఉప్పలం, రేవుపోలవరం, చినఉప్పలం, వాతాడ, బంగారమ్మపాలెం, పెట్టుగోళ్లపల్లి, రామయ్యట్నం, నీలాద్రిపురం గ్రామాలతో పాటు నక్కపల్లి మండలం పెదబోదిగళ్ళం, రామకృష్ణపురం, పెదదొడ్డుగొల్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

- 225 మందికి ఉద్యోగాలు


జాబ్‌మేళాలో నియామక ఉత్తర్వులు పొందిన నిరుద్యోగులు

నక్కపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి అనిత ఆదేశాలతో మంగళవారం నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతమైంది. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ మాట్లాడుతూ.. హోం మంత్రి అనిత నియోజకవర్గంలో నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించాలన్న సంకల్పంతో ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గోవిందరావు మాట్లాడుతూ 16 బహుళ జాతీయ కంపెనీ యాజమాన్యాలతో నిర్వహించిన జాబ్ మేళాలో 225 మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందినట్టు చెప్పారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, కూటమి నాయకులు పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా ఆగని ప్రయాణం

- బ్రిడ్జి శ్లాబ్ ఐరన్ ఊచలు కనిపిస్తున్నా పట్టని అధికారులు
- కనీసం హెచ్చరిక బోర్డు కూడా పెట్టని వైనం


మునగపాకలో శిథిల బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

మునగపాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆ ఫుట్‌పాత్ బ్రిడ్జిపై ప్రయాణం ప్రమాదకరం. బ్రిడ్జి శ్లాబ్ ఐరన్ ఊచలు కనిపిస్తున్నా.. శ్లాబ్ కుంగినా రాకపోకలు ఆగలేదు. వంతెన పరిస్థితిపై కనీసం బోర్డు కూడా అధికారులు ఏర్పాటు చేయలేదు.

మునగపాకలో కృష్ణంరాజు సాగునీటి కాలువపై నాలుగు దశాబ్దాల క్రితం ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణం జరిగింది. ఈ బ్రిడ్జిపై పాదచారులు, ద్విచక్ర, ఆటోలు మాత్రమే రాకపోకలు సాగిస్తూ ఉండేవి. ఇటీవల కాలంలో కార్లు, ట్రాక్టర్లు కూడా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇప్పటి వరకు బ్రిడ్జికి సంబంధించి శిథిలమైన రక్షణ గోడలను గుర్తించారే తప్ప దయనీయంగా మారిన శ్లాబ్ అడుగు భాగాన్ని మాత్రం ఎవరు గుర్తించలేదు. గత నెల 15వ తేదీన సాగునీటి కాలువలో పూడిక పనులు జరుగుతున్న తరుణంలో పొంచి ఉన్న ప్రమాదం వెలుగు చూసింది. అంతా నివ్వెరపోయారు. బ్రిడ్జి శ్లాబ్ మొత్తం పెచ్చులూడిపోయి ఐరన్ బయటకు దర్శనమిస్తోంది. ఒకచోట బ్రిడ్జి కుంగింది కూడా. ప్రస్తుతం బ్రిడ్జి పరిస్థితి ప్రకారం పాదచారులు కూడా రాకపోకలు సాగించడానికి అనువైనది కాదు. అయినా ఆటోలతో సహా అన్ని వాహనాలు యథావిధిగా రాకపోకలు సాగిస్తూనే ఉన్నాయి. బ్రిడ్జి ప్రమాద దుస్థితి వెలుగు చూసి మూడు వారాలు దాటినా ఇప్పటి వరకు అధికార యంత్రాంగం ఏ మాత్రం స్పందించలేదు. కనీసం అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టలేదు. ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి వంతెన పటిష్టతకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తుమ్మపాలలో పంట కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

సాగునీటి కాలువల పునరుద్ధరణకు చర్యలు

▸▸ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సాగునీటి కాలువలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. మంగళవారం తుమ్మపాల, కొండుపాలెం, శంకరం, రేబాక తదితర గ్రామాల్లోని పంట కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపడతామన్నారు. రూ.2 కోట్ల నిధులతో సాగునీటి కాలువలను అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. తద్వారా వ్యవసాయ రంగం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకం, నీటిపారుదల శాఖల మధ్య సమన్వయం ఏర్పరిచి ఈ పనులు చేపడుతున్నామన్నారు. అలాగే రైతులకు శతశాతం సాగునీటిని అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ స్వామినాయుడు, నీటి సంఘాల చైర్మన్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



బాధితురాలి భర్తకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావాడ గ్రామానికి చెందిన డి.అరుణ వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2 లక్షల చెక్కును ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు మంగళవారం అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న అరుణ వైద్యులను సంప్రదించగా వైద్యానికి రూ.6 లక్షలు ఖర్చవుతుందని తెలిపారు. ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వైద్య ఖర్చులు నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును బాధితురాలి భర్త ప్రసాద్‌కు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న, పార్టీ నేత పిల్లా శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కోట్ని బాలాజీ



చంద్రబాబుతో బాలాజీ

అనకాపల్లి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని ఉండవల్లి నివాసంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును విశాఖ ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డీసీఎంఎస్ ఆర్థికంగా పురోగతి సాధించేందుకు సహకరించాలని సీఎం చంద్రబాబును విన్నవించినట్టు ఈ సందర్భంగా బాలాజీ తెలిపారు. అంతేకాకుండా నియోజకవర్గంలోని సమస్యలను కూడా చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్టు ఆయన చెప్పారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న రాంకీ

అనకాపల్లి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గవరపాలెం చినరామస్వామికోవెల జంక్షన్, నూకాంబిక ఆలయానికి వెళ్లే రోడ్డు, రాజుపాలెం, వల్లూరు గ్రామాల ప్రధాన కూడళ్లలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ సోమవారం రాత్రి హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యే రామకృష్ణ నేతృత్వంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా రామకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ద శ్రీను, బొడ్డేడ మురళీ, దాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

కొప్పాకలో పైడితల్లమ్మ పండుగ



అమ్మవారిని దర్శించుకుంటున్న సురేంద్ర

అనకాపల్లి రూరల్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని కొప్పాక గ్రామంలో పైడితల్లి అమ్మవారి పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచి కొప్పాక ప్రజలతో పాటు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కేజీబీవీలకు సకల సదుపాయాలు

▸▸ ప్రత్యేకాధికారిణి మృదుల

సబ్బవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలకు ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తున్నదని ప్రత్యేకాధికారిణి మృదుల తెలిపారు. సోమవారం విలేకరులతో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సన్నబియ్యం సరఫరా చేయడంతో పిల్లలు ఇష్టంగా అన్నం తింటూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అలాగే బాలికలకు పరుపులు, కిచెన్‌కు కూలర్, వెయింగ్ మిషన్, పిండిమిల్లు, మిక్సీ, వంట పాత్రలు పూర్తి స్థాయిలో సరఫరా చేసిందన్నారు. కాగా ఒక స్టాఫ్ రూమ్ అవసరం ఉందని, అందుకు ఎంపీ ల్యాడ్ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. సరిపడా సిబ్బంది లేకపోవడంతో 278 మంది బాలికలకు టిఫిన్‌లో చపాతీ ఇవ్వడం కష్టంగా ఉందన్నారు. ఇందుకు రోటీ మేకర్, ఒక కంప్యూటర్ అవసరం ఉందన్నారు. దాతలు స్పందిస్తే ఈ రెండు అవసరాలు తీరుతాయమని ఆమె పేర్కొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయానికి మైక్‌సెట్ విరాళం

కశింకోట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమాదులపాలెంలో అభయాంజనేయస్వామి మందిరానికి స్కూలు కమిటీ మాజీ చైర్మన్ ఒమ్మి లోవరాజు, చినమ్మలు దంపతులు మంగళవారం మైక్‌సెట్‌ను విరాళంగా అందజేశారు. ప్రతి రోజూ భక్తిగీతాలాపనకు ఎంతో ఉపయోగపడుతుందనే అభిప్రాయంతో ఈ మైక్‌సెట్‌ను ఏర్పాటు చేశామని ఈ సందర్భంగా వారు చెప్పారు.

మూడు రోజుల ముచ్చటే..!

పెద్ద సారు వచ్చారు.. మరో శాఖ ఉన్నతాధికారి ఇద్దరు ఎంవీఐలను వెంటబెట్టుకుని పరుగులు తీశారు.. అందరూ కలిసి ఇక ఈ రోజు నుంచి ఇక్కడ ప్రమాదాలే జరగకూడదని కూడబలికారు.. అందుకనుగుణంగా సమాలోచనలు చేశారు.. వెంటనే స్టాపర్లు పెట్టారు.. సీసీ కెమెరాలు కూడా అమర్చుతామన్నారు.. ఇంతవరకే ఒకే! కాని, ఇది మూడు రోజుల ముచ్చటే..! అని తెలుసుకుని ఇప్పుడు జనాలు నివ్వెరపోతున్నారు. ఏముందిలే అంతా ఆరంభశూరత్వమే..! అని లంకెలపాలెం కూడలిలో ప్రమాదాల నివారణకు అధికారులు చేపడుతున్న చర్యలపై వారు గుసగుసలాడుకుంటున్నారు.

లంకెలపాలెం కూడలిలో ప్రమాదాల నివారణకు చర్యలు శూన్యం

▸▸ ప్రమాదం జరిగిన కొద్ది రోజులే హడావిడి

▸▸ డ్రమ్ములతో సరి.. సీసీ కెమెరాల ఊసే లేదు!

▸▸ ఎస్పీ ఆదేశాలు బేఖాతరు.. కూడలిలో పర్యవేక్షణ కరువు

లంకెలపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని లంకెలపాలెం కూడలిలో ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా జారీ చేసిన ఆదేశాలను పోలీసు, రవాణా శాఖ అధికారులు బేఖాతరు చేశారు. గత నెల 23న విశాఖ పోర్టు నుంచి తెలంగాణ సిద్దిపేటకు పప్పుల బస్తాలతో వెళుతున్న లారీ, జంక్షన్‌లో సిగ్నల్ వద్ద ఆగివున్న వాహనాలపైకి దూసుకుపోయిన ప్రమాదంలో సంఘటన స్థలంలోనే ముగ్గురు, ఆస్పత్రిలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మరో 13 మంది ఇప్పటికీ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా గత నెల 27న కూడలిని సందర్శించారు. ఆ సమయంలో జిల్లా రవాణా శాఖ అధికారి మనోహర్ కూడా ఎంవీఐలతో కలిసి అక్కడికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసు, రవాణా శాఖ అధికారులు ఆరా తీశారు.



కూడలిని సందర్శించి పోలీసు, రవాణా శాఖ అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా (ఫైల్ ఫొటో)

ఈ సమయంలో లంకెలపాలెం కూడలని ప్రమాద రహిత కూడలిగా చర్యలు చేపట్టాలని ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాలు జారీ చేశారు. కూడలికి నాలుగు వైపులా పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా సిగ్నల్ జంపింగ్, అతి వేగంగా వెళ్లే వాహనాలను గుర్తించి చలానాలు విధించాలని, వేగ నియంత్రణకు స్టాపర్లు, ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, నిత్యం పర్యవేక్షించి ట్రాఫిక్ ఉల్లంఘన వాహనాలపై కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. ఇదంతా రోజుల వ్యవధిలోనే చేపట్టాలనే స్పష్టంగా ఆదేశాలు జారీ చేశారు. తర్వాత రోజున రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్లు, స్థానిక పోలీసులు కూడలికి గాజువాక నుంచి వచ్చే మార్గంలో తూతూమంత్రంగా సాపర్లు ఏర్పాటు చేశారు. అక్కడితో తమ పనైపోయిందని చేతులు దులిపేసుకున్నారు. పరవాడ పోలీసులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ ఏర్పాటు చేసిన స్టాపర్లను కూడా కొద్ది రోజుల్లోనే గుర్తు తెలియని వ్యక్తులు పక్కకు నెట్టేశారు. తాజాగా డ్రమ్ములు ఏర్పాటు చేసినప్పటికీ, సీసీ కెమెరాలను మాత్రం మరిచారు. ఇక ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశించినట్టు ప్రమాదాల నివారణ కోసం పరవాడ పోలీసులు ఇక్కడ చేపడుతున్న చర్యలు, పర్యవేక్షణ మచ్చుకైనా కనిపించడం లేదని స్థానికులు, వాహన చోదకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూడలిలో పెను ప్రమాదాల జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా స్పందించి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



కూడలిలో అపరిచితులు నెట్టేయడంతో రోడ్డు పక్కన ఉన్న స్టాపర్లు

సుపరిపాలనలో అన్ని వర్గాలకూ న్యాయం

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్

వాడవాడలా 'సుపరిపాలనలో తొలి అడుగు'

అనకాపల్లి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోని సుపరిపాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతున్నదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం 84వ వార్డు పరిధిలోని వడ్డివీధి, చినరాజుపేట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల హామీలను అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తున్నదన్నారు. ఇందులోభాగంగా సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తుంటే జగన్‌రెడ్డి పోలీసులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. జగన్ లాంటి అరాచకశక్తులు రాష్ట్రానికి అవసరమా అని జగదీశ్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోడి వెంకటరావు, కుప్పిలి జగన్, శ్రీకాకుళం గణపతి, యర్రా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అలాగే 81వ వార్డులో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే ఎంపీ, ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొలమరశెట్టి చందు, భీమరశెట్టి త్రినాథ్, పొలిమేర ఆనంద్, పైలా గోపి పాల్గొన్నారు.



చినరాజుపేటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద

బయ్యవరంలో...

కశింకోట: మండలంలోని బయ్యవరం గ్రామంలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్.కె.బాబర్ ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏడాదిలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. పెన్షన్ రూ.4 వేలు, ఉచిత గ్యాస్ పంపిణీ, తల్లికి వందనం, అన్న క్యాంటీన్, గ్రామాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు సీరం వెంకటలక్ష్మి, సిదిరెడ్డి ప్రసాద్, మేడిశెట్టి నాగరామఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గొర్లివానిపలెంలో...

సబ్బవరం: మండలంలోని గొర్లివానిపాలెం గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నేతలతో కలసి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి, పరిశీలకులు కొరాడ రాజుబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రెండు నెలల్లో మరిన్ని సంక్షేమ పథకాలు అమల్లోకి రానున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.ముత్యాలనాయుడు, నాయకులు జి.వంశీదీప్, జి.దేముడు, గొర్లి చైతన్య, పల్ల తాతారావు, బి.లక్ష్మణ, గడ్డప్ప, గొర్లి కృష్ణ, ఎల్లాజీ, గొర్లి శ్రీమూర్తులు, బి.అప్పారావు, జి.విష్ణు పాల్గొన్నారు.

ఘనంగా దాడి రత్నాకర్ జన్మదిన వేడుకలు

అనకాపల్లి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ మంగళవారం జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జన్మదిన కేకును రత్నాకర్ కట్ చేసి అందరికీ పంచారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి రత్నాకర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు, పేదలకు రత్నాకర్ రైస్ బ్యాగ్‌లను, విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, మిఠాయిలు పంపిణీ చేశారు. తుమ్మపాల పీహెచ్‌సీలో టీడీపీ నాయకులు రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. అలాగే చినరాజుపేటలోని చౌడేశ్వర సాంబమూర్తి ఆలయంలో అన్నదాన కార్యక్రమం, ఇతర ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు వేగి దొరబాబు, వేగి పవన్‌కుమార్, దాసరి బాబు, అందే సన్యాసిరావు, గొంతిన లోవఅప్పారావు, కూండ్రపు అక్కునాయుడు, మేడిశెట్టి సన్యాసినాయుడు, అందే రమణ, కరక రాజు, లక్ష్మీనారాయణ, లోవ కృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది రత్నాకర్‌కు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.





రత్నాకర్‌ను సత్కరించి అభినందిస్తున్న నాయకులు... దివ్యాంగుడికి రైస్ బ్యాగ్ పంపిణీ చేస్తున్న రత్నాకర్

స్టేషన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాలి

అనకాపల్లి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు స్టేషన్ రోడ్డును తక్షణమే అభివృద్ధిపరచాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ పనులను పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో స్టేషన్ రోడ్డు విస్తరణ, అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఈ పనులను చేపట్టకపోవడం విచారకరమన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చొరవ తీసుకుని రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, నాయకులు జాజుల రమేశ్, కోరుకొండ రాఘవ, కేఎం నాయుడు, వేగి త్రినాథ్, దాడి నారాయణరావు పాల్గొన్నారు.

నెహ్రూచౌక్‌లో ప్రభుత్వ పింఛన్‌దారుల ధర్నా

అనకాపల్లి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు నెహ్రూచౌక్‌లో మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పింఛన్‌దారుల సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బిల్లులో ప్రవేశపెట్టిన వేలిడేషన్ అమెండ్మెంట్ అమలులోకి వస్తే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా నష్టపోతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 12వ పే కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు చెల్లించాలని, ఉద్యోగ, పెన్షనర్లకు హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం అమలు చేయాలని కోరారు. రైల్వే, విమాన సర్వీసుల్లో సీనియర్ సిటిజన్ రాయితీలను పునరుద్ధరించాలని, పింఛన్‌దారులకు కమ్యూటేషన్ రికవరీ కాలాన్ని 15 నుంచి 11 ఏళ్లకు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు ప్రారంభంలో పింఛన్‌దారుల ఆరాధ్యులైన డీఎస్ నకార చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎల్ఎస్ శర్మ, సిహెచ్.సోమేశ్వరరావు, జి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.



నెహ్రూచౌక్‌లో ధర్నా చేస్తున్న పింఛన్‌దారులు


కంటి శుభ్రతపై అవగాహన

కొత్తూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని సత్యనారాయణపురం-2 మూలపేట గ్రామంలో కంటి శుభ్రతపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యశోద మాట్లాడుతూ కళ్ల కలగలు వచ్చినప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. చేతులు తరచూ శుభ్రం చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత రుమాలు వాడడమే కాకుండా ఇతరులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల్లో జడ్‌సీ తనిఖీలు

అనకాపల్లి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూడు, నాలుగు, ఆరు వార్డు సచివాలయాలను జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తి మంగళవారం తనిఖీలు చేశారు. పీ-4 సర్వేలో భాగంగా బంగారు కుటుంబాల వివరాలను త్వరితగతిన సేకరించాలని ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన ఆదేశించారు. అలాగే సచివాలయానికి వచ్చే ప్రజల పట్ల సానుకూలంగా స్పందించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



శిబిరంలో కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యుడు

పరవాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాడచీపురుపల్లిలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు ప్రారంభించారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి చెందిన వైద్యుల పర్యవేక్షణలో 106 మంది రోగులకు కంటి పరీక్షలు చేశారు. వీరిలో 32 మందిని ఆపరేషన్‌కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్‌కు తరలించారు. ఈ శిబిరంలో డాక్టర్ వివేక్‌శర్మ, మేనేజర్ అరుణ్‌కుమార్, ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, సభ్యులు రామారావు, సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లగుంట శ్మశానవాటిక స్థలానికి సర్వే



శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేస్తున్న దృశ్యం

పరవాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రావాడ పంచాయతీలోని గొల్లగుంట గ్రామానికి సంబంధించి శ్మశానవాటిక స్థలానికి మంగళవారం రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. ఇటీవల గ్రామానికి చెందిన ముస్లింలు తమ శ్మశానవాటిక స్థలానికి రక్షణ కల్పించాలని ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును కోరారు. ఈ మేరకు అచ్యుతాపురం మండలం నడింపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్-2లో శ్మశానవాటిక స్థలానికి అక్కడి వీఆర్వో వెంకటేశ్, సర్వేయర్ గణేశ్ సర్వే చేశారు. సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు సమక్షంలో సర్వే చేసి సరిహద్దులు గుర్తించారు.

'84వ వార్డు టీడీపీ కమిటీ ఎన్నిక ఏకపక్షం'

అనకాపల్లి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 84వ వార్డు టీడీపీ కమిటీ ఎన్నిక ఏకపక్షంగా జరిగిందని పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు బోడి వెంకటరావు, పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్మోహనరావు ఆరోపించారు. మంగళవారం చినరాజుపేటలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికల పరిశీలకులు పి.అచ్చెయ్యనాయుడు నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఎన్నికలు నిర్వహించారన్నారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీయడం సరికాదన్నారు. ఈ కమిటీపై పార్టీ అధి నాయకత్వానికి ఫిర్యాదు చేస్తామని వారు చెప్పారు. సమావేశంలో పార్టీ నేతలు వి.త్రినాథ్, పి.సత్యనారాయణ, అంద్ర బాబూరావు, యర్రా సత్యనారాయణ పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీల్లో అందరికీ అవకాశాలు కల్పించాలి

జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు అప్పలరాజు

కొత్తూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ నటరింగ్ కమిటీల్లో అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు కల్పించాలని విజిలెన్స్ కమిటీ జిల్లా సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. అనకాపల్లి పట్టణంలో మంగళవారం నిర్వహించిన కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీలో అన్ని ప్రాంతాల వారీగా ప్రాధాన్యత కల్పించాలన్నారు. కమిటీ నియామకాల్లో మాల, మాదిగలకు అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కట్టమూరి మంగరాజు, దళిత బహుజన ఆదరణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన్న అప్పారావు, దళిత సంఘం సీనియర్ నాయకుడు చెవ్వేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


వర్షాలకు బురదమయంగా మారిన పిల్లిగెడ్డ వంతెన అప్రోచ్


కోతకు లోనై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ప్రమాదాల వారధి.. పట్టని తీరిది..

- అసంపూర్తిగా పిల్లిగెడ్డ వంతెన అప్రోచ్ పనులు
- బురదలో కూరుకుపోతున్న వాహనాలు
- ఆంధ్రా - ఒడిశా మధ్య రాకపోకలకు అవస్థలు

సీలేరు, జూలై 15 , (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో రెండు రాష్ట్రాలను కలిపే పిల్లిగెడ్డ వంతెన అప్రోచ్ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. సరిహద్దుల్లోని సీ లేరు మీదుగా ఆంధ్రా, ఒడిశా వెళ్లేందుకు ఈ వాగుపై గతంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో గత ప్రభుత్వ హయాంలో రూ. 3 కో ట్లు మంజూరయ్యాయి. అయితే, గత ఏడాది సెప్టెంబర్ 8వతేదీన ఈ ప్రాం తంలో సంభవించిన పెను తుఫాన్‌కు పాత వంతెన కొట్టుకుపోయింది. అప్పటికే కొత్త వంతెన నిర్మాణం పనులు పూర్తయి, ఇరువైపులా అప్రోచ్ ని ర్మాణం మాత్రం నిలిచిపోయింది. పాత వంతెన కొట్టుకుపోయి రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో రాకపోకలకు వీలుగా అప్రోచ్ కుమట్టి పనులు మాత్రమే చేయించి తాత్కాలికంగా పునరుద్ధరించి అధికా రులు చేతులు దులుపుకున్నారు. వంతెనకు రెండు పక్కలా శాశ్వత ప్రాతిపదిక చేపట్టాల్సిన అప్రోచ్ పనులపై దృష్టి పెట్టకుండా నిర్లక్ష్యంగా వదిలేశా రు. దీంతో ఈ ప్రాంతంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రమట్టి బురదమయమై వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. దీంతో రెండు రాష్ట్రాల రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంటోంది. మరోవైపు భారీ వర్షానికి వంతెన వద్ద రెండు పక్కలా పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ గుంతల వద్ద లోడు లారీల డ్రైవర్లు ఆదమరిస్తే పెనుప్రమాదం సంభవించే అవకాశాలున్నాయి. అప్రోచ్ కు పోసిన మట్టి జారిపోకుండా సపోర్టుగా రాయితో రివిట్‌మెంట్ (రాయి సోలింగ్) కూడా చేయకుండా వదిలేశారు. దీంతో మట్టి జారిపోతోంది. పిల్లిగెడ్డ వంతెన వినియోగంలోకి తీసుకొచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా అప్రోచ్ పనులు జాప్యంపై రెం డు రాష్ట్రాల వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చినుకుపడితే ఈ వంతెన మీదుగా వెళ్లాలంటే భయాందోళనకు లోనవుతున్నారు. బురదలో వాహనాలు కూరుకుపోయి ఎక్కడ కారడవిలో చి క్కుకుపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గెడ్డ వద్ద అప్రోచ్ వద్ద పూర్తిస్థాయిలో పనులు చేసి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

పార్టీ కోసం శ్రమించే వారికి సముచిత స్థానం

- అరకు లోయ పార్లమెంటరీ టీడీపీ నియోజవర్గ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్

పాడేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో శ్రమించే ప్రతి ఒ క్కరికీ సముచిత స్థానం లభిస్తుందని ఆ పార్టీ అరకులోయ పార్లమెంటరీ అధ్యక్షుడు, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం ఏజెన్సీలోని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మ రింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలన్నారు. అలాగే కష్టించి పని చేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో చక్కని గుర్తింపు ఉంటుందన్నారు. ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రాభివృద్ధికి, ప్రతి కుటుంబానికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసిందన్నారు. వాటిపై ప్రజల్లో మరింత అవగాహన పెం చేందుకు కృషి చేయాలని, విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. మాజీ ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్, చిత్రంలో గిడ్డి ఈశ్వరి

గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ... సుపరిపాలన కా ర్యక్రమాన్ని ఉత్సాహంగా ప్రజలకు చేరువ చేయాలని కోరారు. టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పోలుపర్తి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, పార్టీమండల అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.


గుడివాడ గడ్డి కాలనీలో ప్రచారం చేస్తున్న టూరిజం డైరెక్టర్, తదితరులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

పాడేరు: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తున్నదని ఏపీ టూరిజం డైరెక్టర్ కిల్లు వెంకటరమేశ్‌నాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని గుడివాడ గడ్డికాలనీలో మంగళవారం 14వ రోజు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నా రు. అలాగే ప్రజలు సైతం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోడా వెంకట సురేశ్ కుమార్, టి.మూర్తిబాబు, ఎల్.శ్రీను, వి. సురేంద్రరాజ్, ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సమస్యలపై ఫిర్యాదు

పాడేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని మంగళవారం కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా సదరం శిబిరం, వివిధ వార్డులను ఆయన పరిశీలించారు. అలాగే రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగులు, వారి బంధువులతో మాట్లాడి ఆరా తీశారు. అలాగే ఆస్పత్రిలో రోగుల సేవలు, ఇతర అంశాలపై సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బందికి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఇదే సమయంలో ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా అంతరాయం నెలకొనడంతో అసహనం వ్యక్తం చేశారు. అలాగే ఆస్పత్రిలో సిబ్బంది కొరతతో రోగులు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ పరిశీలించారు. ఈ పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామన్నారు. ఆస్పత్రిలో ప్రధానంగా నీటి సమస్య అధికంగా ఉందని, పారిశుధ్యం సైతం అంతంతమాత్రంగా ఉందని, సిబ్బంది రోగుల పట్ల సకాలంలో స్పందించడం లేదని, ల్యాబ్ పనులు, మందుల పంపిణీ సైతం ఆలస్యంగా జరుగుతున్నదని పలువురు రోగులు, వారి బంధువులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వమిత్ర, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


చిల్డ్రన్ వార్డులో బాలుడ్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

ఇళ్ల నిర్మాణ సమస్యల పరిష్కారానికి కృషి


కరాయిగుడలో మాట్లాడుతున్న విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సభ్యుడు దేవదాస్

అనంతగిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం పంచాయతీ కరాయిగుడ, అతిమల, కితలంగి పీవీటీజీ గ్రామాల్లో ప్రధానమంత్రి జ న్‌మన్ పథకం ఇళ్ల నిర్మాణాలను జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యుడు వంతల దేవదాస్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను స్వయంగా కలిసి మాట్లాడారు. నిర్మాణాల్లో సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. వీటిని పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం దేవదాస్ మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకు కేంద్ర ప్రభు త్వం కృషిచేస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాఫీబోర్డు డైరెక్టర్ శెట్టి రాజు, బీజేపీ అరకు మం డల పార్టీ అధ్యక్షుడు రామచంద్ర, ఏఈ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై విశ్రాంత ఉద్యోగుల ధర్నా


కలెక్టరేట్ ముందు ఆందోళన చేపడుతున్న విశ్రాంత ఉద్యోగులు

పాడేరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విశ్రాంత ఉద్యోగులు మంగళవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షకార్యదర్శులు రొబ్బా నాగభూషణరాజు, జి.శ్రీహరిరావు ఆధ్వర్యంలో ఈ ధర్నా చేపట్టారు. అనంతరం వారి సమస్యలపై జా యింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నేతలు జి.మోహనరావు, కె.గంగన్నపడాల్, ఎల్. కృష్ణ, వైవీ రామకృష్ణ, ఎంసీహెచ్ రామునాయుడు, పలాసి కృష్ణారావు, ఎం.మోదకొండ, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల పునరుద్ధరణ హర్షణీయం

- మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు


మాట్లాడుతున్న బాలరాజు

చింతపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్గానిక్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల పునఃప్రారంభించడం మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు హర్షించదలచిన అంశమని తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలను రద్దు చేస్తూ ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీతో తల్లిదండ్రులు, విద్యార్థులు విజ్ఞప్తి మేరకు ఈనెల 11తేదీన కళాశాలను సందర్శించి ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామితో చర్చించామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి, విశ్వవిద్యాలయం ఉప కులపతికి లేఖరాసినట్టు చెప్పారు. మంత్రులు వెంటనే స్పందించి కళాశాల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉల్లి లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ చిన్నబ్బాయి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేపూరి గిరి పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

ముంచంగిపుట్టు, జులై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించాయిపుట్టు, జర్జుల పంచాయతీల పరిధిలోని పెద్దాపుట్టు, సింధిపుట్టు, బలడ గ్రామాలలో జీపీఎస్ పాఠశాలలను ఎంఈవో కృష్ణమూర్తి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు.పాఠశాలల రికార్డులను పరిశీలించారు. ఆన్‌లైన్ హాజరు తప్పని సరిగా నమోదు చేయాలని, లెసన్ ప్లాన్, ఇయర్ ప్లాన్ డైరీలను ఖచ్చితంగా పాటించాలని అన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

ఐటీఐ రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

చింతపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐలో రెండో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులకు ఈనెల 20తేదీ వరకు గడువు పెంచినట్టు స్థానిక ప్రిన్సిపాల్ ఎ. రమణ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 22తేదీలోగా సమీపంలోనున్న ఐటీఐలో ధ్రువపత్రాల పరిశీలన, 23న కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

- ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్

చింతపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఈపీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ జీఎస్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఉప కేంద్రంలో సబ్ డివిజన్ పరిధి విద్యుత్‌శాఖ సిబ్బందితో ఈపీడీసీఎల్ అధికారులు ప్రజలతో సత్సంబంధాలు(పబ్లిక్ రిసెప్షన్)పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సూ పరింటెండెంట్ ఇంజనీర్ మాట్లాడుతూ చిత్తశుద్ధితో, బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. సమస్యలపై వచ్చిన ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలన్నారు. విద్యుత్ తీగలు తెగి కిందపడితే ప్రజలు, మూగజీవులు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. లైన్లు ప్రమాణాలతో ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించుకోవాలన్నారు.విద్యుత్ లైన్లలో సాంకేతిక సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం అందుబాటులోనున్న విద్యుత్ లైన్లు ద్వారా పీవీటీజీ, నాన్ పీవీటీజీలకు 25వేల విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ఈకార్యక్రమంలో పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. వెణుగోపాల్, టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్. చిన్నబాబు పాత్రుడు, చింతపల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. సన్నిరాంబాబు, చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు, జి.మాడుగుల ఏఈఈ, జేఈలు వనుము ప్రభాకరరావు, ఎంవీ రమణ, కె. నాగేశ్వరరావు, కె. శ్రీనివాస్, ఎం. మాధవరావు పాల్గొన్నారు.

వలజంగిలో ప్రత్యేక వైద్య శిబిరం


గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


ముంచంగిపుట్టు, జులై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగబయలు పంచాయతీ వలజంగి గ్రామంలో మంగళవారం లబ్బూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆ గ్రామానికి చెందిన ఓ చిన్నారి జ్వరంతో మృతి చెందగా పలువురు జ్వరాలతో బాధపడుతున్నట్టు పత్రికల్లో వచ్చిన కథనాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో బాధిత గ్రామంలో శిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరాలతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్న 19 మందికి వైద్య పరీక్షలు నిర్వహిం చారు. ఈ గ్రామాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణమూర్తి సందర్శించారు. సమస్యలు తెలుసుకున్నారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ వో చిన్నాన్న, వైద్య సిబ్బంది రాజారావు, కాసులమ్మ, గౌరీమణి, అరుణ పాల్గొన్నారు.

హెచ్‌డబ్ల్యూవో కొండలరావు సేవలు అభినందనీయం


హెచ్‌డబ్ల్యూవో కొండలరావుని సన్మానిస్తున్న ఏటీడబ్ల్యూవో జయ నాగలక్ష్మి, వార్డెన్లు

చింతపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): లంబసింగి ఆశ్రమ పాఠశాలలో హెచ్‌డబ్ల్యూవోగా విధులు నిర్వహించిన చల్లంగి కొండలరావు సేవలు అభినందనీయమని స్థానిక ఏటీడబ్ల్యూవో బి. జయనాగలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక ఏటీడబ్ల్యూవో కార్యాలయంలో పదవీ విరమణ పొందిన కొండలరావుని సహచర హెచ్‌డబ్ల్యూవోలు, డిప్యూటీ వార్డెన్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను ప్రత్యేక కృషి చేశారన్నారు. ఈకార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో జిల్లా అధ్యక్షుడు పసుపులేటి వినాయకరావు నాయకులు ఉగ్రంగి గణేశ్వరరావు, నూకరత్నం, పద్మ, శ్రీనివాసరావు, వేణు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ఉపాధ్యాయుడు రాజును సన్మానిస్తున్న గ్రామస్థులు

ముంచంగిపుట్టు, జులై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దారెల పంచాయతీ పేటమాలిపుట్టు ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు సమరెడ్డి రాజు సేవలు ఆదర్శనీయమని వక్తలు అన్నారు. గత 8 ఏళ్లపాటు పని చేసి బదిలీ అయిన సందర్భంగా పాఠశాల ఎస్.ఎంసీ కమిటీ, ఆ గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం వీడ్కోలు సభను ఏర్పాటు చేసి అతనిని సన్మానించారు. హెచ్‌ఎం టి.రమేష్, ఎస్.ఎంసీ కమిటీ ఛైర్మన్ వి.బలరాం, వైస్ సర్పంచ్ మధుబాల, ఉపాధ్యాయులు అప్పలస్వామి, పార్వతి, ఇంద్రావతి, వీఆర్‌పీ రుక్మాంధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ రీ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: జేసీ

పాడేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ హెచ్చరించారు. జిల్లాలో భూముల రీసర్వేపై రెవెన్యూ, సర్వే విభాగం అధికారులతో మంగళవారంనిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరుకు నిర్దేశించిన భూమలు రీసర్వే ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అలాగే, రీసర్వేలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా భూ సర్వేలో పురోగతి సాధించలేని వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. అలాగే జలాశయాల పరిధిలో ఉన్న రైతులకు డిమాండ్ నోటీసు జారీ చేసి వారి నుంచి నీటి పన్ను వసూళ్లు చేయాలని ఆదేశించారు. అలాగే, తహసీల్దార్ కార్యాల యాల్లో 12 ఆడిట్ పేరాలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పరిష్కరించాలన్నారు. వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస ఏర్పాట్లు చేయాలని, ప్రస్తుతం గోదావరి, శబరి నదుల ప్రవాహాలు పరిశీలించి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, జిల్లాలోని 22 మండలాల తాహశీల్దార్లు,డీటీలు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ, పక్కన డీఆర్వో పద్మలత

చిరు ధాన్యాల సాగుపై దృష్టి


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ అప్పలరాజు, ఏవో

జి.మాడుగుల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు చిరు ధన్యాల సాగుపై దృష్టి సారించాలని ఎంపీపీ లొంబోరి అప్పరాజు అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో శత శాతం సబ్సిడీపై రాగులు, చోడి, కొర్ర విత్తనాల రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. అంతరించిపోతున్న సంప్రదాయ పంటలు పండించి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు. మండల వ్యాప్తంగా 315 రాగి విత్తనాల కిట్లు 100 శాతం సబ్సిడీ సిద్ధంగా ఉన్న ఏవో వరప్రసాద్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, సిబ్బంది ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరులో 36.7 డిగ్రీలు

పాడేరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మన్యంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో మంగళవారం కొయ్యూరులో 36.7డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా.. అరకులోయలో 33.3, అనంతగిరిలో 32.3, జి.మాడుగులలో 32.2,చింతపల్లిలో 32.0, పాడేరులో 31.5, పెదబయలులో 31.1, జీకేవీధిలో 30.8, డుంబ్రిగుడలో 30.0, హుకుంపేటలో 29.9 డిగ్రీలసెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

జిల్లాలో రాగల ఐదు రోజుల్లో మోస్తరు వర్షాలు

చింతపల్లి: జిల్లా వ్యాప్తంగా రాగల ఐదు రోజుల్లో ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. ఈనెల 20తేదీ వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా మూడు మిల్లీ మీటర్ల నుంచి గరిష్ఠంగా 25మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్నారు.

రేషన్ కార్డు దరఖాస్తుదారులకు ఈకేవైసీ

చింతపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ తెలిపారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వో, వీఆర్‌ఏలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో రేషన్ కార్డుల కోసం 4,500 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈదరఖాస్తులను పరిశీలించి ఆమోదించినట్టు చెప్పారు. అలాగే, వీఆర్ఏ, వీఆర్వోలు ఫారెస్టు, రెవెన్యూ భూములను గుర్తించాలన్నారు. జీవో 23 ప్రకారం ఇల్లులేని గిరిజనులకు ఇంటి పట్టాలు అందజేస్తామన్నారు. పీ-4పై అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో డీటీ చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు



గాయపడిన తండ్రీ, కుమారుడు

అనంతగిరి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అనంతగిరి ఘాట్‌రోడ్డులో తండ్రి, కొడుకులు, మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం వద్ద మరో ఇద్దరు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అరకులోయ సమీపంలోని పప్పుడువలస గ్రామానికి చెందిన తండ్రి, కొడుకులు ఎస్.వెంకటరావు (45), ఎస్.ప్రవీణ్ (23) ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం బయలుదేరారు. అనంతగిరి ఘాట్‌రోడ్డు హెయిర్ పిన్‌బెండ్ 5వ మలుపు దాటిన తరువాత ముందు బ్రేక్ పట్టేయడంతో ప్రమాదానికి గురయ్యారు. ప్రవీణ్ చేయి విరిగిపోగా, వెంకటరావు తలకు గాయమై అపస్మారకస్థితికి చేరుకున్నారు. స్థానికులు క్షతగాత్రులకు సపర్యలు చేసి, 108 వాహనంలో ఎస్‌కోట ఆస్పత్రికి తరలించారు. వెంకటరావు పరిస్థితి విషమంగా ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.

సీపీఎం కార్యాలయం వద్ద..

మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అనంతగిరి సెక్షన్‌లోని అటవీశాఖ బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కూడ భాస్కరరావు, సోదరుడు వెంకటనారాయణ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అరకువైపు నుంచి వేగంగా వస్తున్న కారు వీరిని ఢీకొంది. దీంతో భాస్కరరావు, వెంకటనారాయణ తీవ్రంగా గాయపడ్డారు. వారిని అనంతగిరి పీహెచ్‌సీకి ఆ తరువాత మెరుగైన వైద్యంకు విశాఖ తరలించారు.

స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దు: సీపీఎం


సుంకరమెట్ట లో నిరసన వ్యక్తంచేస్తున్న దృశ్యం

అరకులోయ, జూలై 15 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సుంకరమెట్టలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆ పార్టీ జిల్లా కమిటి ప్రతినిధి కిం డంగి రామారావు, మండల నా యకుడు, సర్పంచ్ గెమ్మెలి చినబాబు ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులు ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ మీటర్లతో వినియోగదారులకు తీవ్ర నష్టం వాటిల్లుందని ఆందోళన వ్యక్తంచేశారు.

భూసార కిట్లు సద్వినియోగం చేసుకోండి

జి.మాడుగుల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సొలభం పం చా యతీ పరిధి శ్రీమత్స్యదేవత ఎఫ్‌పీవో ద్వారా ఐఐఎంఆర్ కల్పించిన భూ సార పరీక్ష కిట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌పీవో సీఈవో ఐసారం హనుమంతరావు సూచించారు. మంగళవారం మండలంలో నాలుగు పం చాయతీల నుంచి 37 గ్రామాల రైతులను ఎంపిక చేసి ఈ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సాధనాలతో భవిష్యత్తు ల్లో రైతులు సొంతంగా భూసార పరీక్షలు నిర్వహించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి. చినకుమారి, బోర్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు

చింతపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దుకాణాల్లో మత్తుపదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో పాఠశాలలు, కళాశాలలు పరిసరాల్లో నున్న దుకాణాల్లో ఆపరేషన్ సేఫ్ క్యాంపస్‌లో భాగంగా పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పాఠశాల, కళాశాల పరిసరాల దుకాణాల్లో ఖైనీ, గుట్కా, గంజాయి సిగరెట్లు, చాక్లెట్లు విక్రయిస్తున్నట్టు పోలీసు నిఘా వర్గాలు హెచ్చరించాయన్నారు. ఈమేరకు తనిఖీలు నిర్వహించామన్నారు.

చదువుతోనే భవిష్యత్తు

డుంబ్రిగుడ: క్రమశిక్షణతో చదువుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ పాపినాయుడు అన్నారు. మండలంలోని కిల్లోగుడ ఆశ్రమ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత బాలురు ఆశ్రమ పాఠశాలల్లో గుడ్ టచ్..బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. గంజాయి, మత్తు పదార్థాలతో కలిగి నష్టాలపై విద్యార్థులకు వివరించారు. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల చొరవతో పాఠశాల మరమ్మతు

పెదబయలు: కుంతుర్ల పం చాయతీ పాత పాడులోని ప్రభుత్వ యూపీ పాఠశాలను పోలీసుల సాయంతో మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా స్థా నిక ఎస్ఐ కొల్లి రమణ మాట్లాడారు. ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు పోలీస్ నిధులతో ఈ భవనానికి పనులు చేపట్టి వినియోగంలోకి తెచ్చారు.

కొలతల మేరకు పనిచేస్తే గిట్టుబాటు వేతనం

▸ డ్వామా పీడీ పూర్ణిమాదేవి



ఉపాధి శ్రామికులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ పూర్ణిమాదేవి

బుచ్చెయ్యపేట జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం డ్వామా పీడీ పూర్ణిమాదేవి పరిశీలించారు. తొలుత బుచ్చెయ్యపేటలో జరుగుతున్న కాలువ పనులను పరిశీలించి ఉపాధి శ్రామికులతో మాట్లాడారు. కొలతల ప్రకారం పని చేసి రోజు వారి వేతనంగా రూ. 307 పొందాలని సూచించారు. అనంతరం వడ్డాది గ్రామంలో సయ్యపురెడ్డి మాధవరావు పొలంలో ఉపాధి హామీ పథకం ద్వారా నాటిన కొబ్బరి మొక్కల మధ్య తవ్విన ట్రెంచ్ పనులను, ఫారంపాండ్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా రైతు మాధవరావు, మాట్లాడుతు తాను 2 ఎకరాల పొలంలో 120 కొబ్బరి మొక్కలు నాటామని, అవి ప్రస్తుతం ఫల సాయానికి రానున్నట్టు వివరించారు. ఆయన వెంట ఎంపీడీవో భానోజీరావు, ఏపీవో వరహలబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచి పాలన అందించాం: ఎమ్మెల్యే రాజు



ఎడ్లవీధిలో మహిళలకు కరపత్రాలంద చేస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అధికారంలోనికి వచ్చి తొలి ఏడాదిలోనే చక్కనిపాలన అందించామని స్థానిక ఎమ్మెల్యే రాజు తెలిపారు. సోమవారం రాత్రి పట్టణంలో ఎడ్లవీధిలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అ మలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గూనూరు మల్లునాయుడు, ఈర్లె శ్రీనివాసరావు, బొంతు దే ముడుబాబు, ఎర్రంశెట్టి చిన్న, దేవరపల్లి వెంకట అప్పారావు, స కు రు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

19న చోడవరంలో మెగా జాబ్‌మేళా

చోడవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 19న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు మంగళవారం తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ మేళాలో నియోజకవర్గానికి చెందిన నాలుగు మండలాల్లో అర్హులైన యువతీయువకులు హాజరై ఉద్యోగ అవకాశాలు పొందాలని ఎమ్మెల్యే కోరారు.

డైనింగ్ హాలు ప్రారంభం

అదే రోజు హైస్కూల్‌లో ఎంపీ విజయేంద్ర ప్రసాద్ నిధులతో ని ర్మించిన డైనింగ్ హాలును కూడా ప్రారంభించనున్నామని ఎమ్మెలే వివరించారు.

ఉపాధ్యాయులకు కరదీపికలు పంపిణీ

చోడవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు మార్గదర్శకంగా ప్రభుత్వం రూపొందించిన కరదీపికలు మండలానికి చేరాయి. ఈ కరదీపికలను మంగళవారం స్థానిక ఎంఈవోలు తిరుపతిరావు, సిహచలంలు విడుదల చేశారు. అనంతరం వీటిని మండలంలోని ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గరిమెళ్ల శ్రీను, గొల్లు శ్రీనివాసరావు, సీఆర్ఎంటీలు కేవీఎం నాయుడు, సరోజిని, భూలక్ష్మి. గంగునాయుడు, నాగరాజు, దేవి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ పండగ



వడ్డాదిలో మోద కొండమ్మను దర్శించుకుంటున్న భక్తులు

బుచ్చెయ్యపేట జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది గ్రామంలో మంగళవారం ఘనంగా మోదకొండమ్మ పండుగ జరిగింది. స్థానిక పాత సినిమాహల్ వద్ద నాలుగు రోడ్ల కూడలిలోని ఆలయానికి భక్తులు తరలివచ్చి మెక్కులు చెల్లించుకున్నారు. నేల వేషాలు బాణ సంచాతో ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సేట్ హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

20న కేజే పురం అమ్మవారి జాతర

మాడుగుల: మండలంలోని కస్పాజగన్నాధపురంలో ఈ నెల 20వ తేదీన జరగనున్న మోదకొండమ్మ జాతర కు సంబంధించి పోస్టర్‌ని ఎమ్మెల్యే బండారు స్యతనారాయణమూర్తి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రాపేటి జోగినాయుడు, సర్పంచ్ రమణబాబు, వైస్ చైర్మన్ రాజశేఖర్‌నాయుడు, టీ డీపీ మండలాధ్యక్షుడు అద్దెపల్లి జగ్గారావు, క్లస్టర్ ఇన్‌చార్జి పుప్పాల రమేశ్, పెంటకోట జగన్నాధరావు పాల్గొన్నారు.

శ్రమదానంతో గోతులు పూడ్చివేత



గోతులు పూడ్చుతున్న గిరిజనులు

రోలుగుంట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వైబీపట్నం నుంచి పెదగరువు వరకు గల రోడ్డులో గోతులను శ్రమదానంతో గిరిజనులు పూడ్చారు. రూ.2.50 కోట్లతో ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వైబీపట్నం నుంచి లోసింగి వరకు జీఎస్‌బీ గ్రానియల్ సబ్ వే నిర్మించి, మిగిలిన రోడ్డును వదిలేశారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే ఆపేశారు. దీంతో మంగళవారం ఆయా గ్రామాల గిరిజనులు శ్రమదానంతో గోతులను పూడ్చుకున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు పూర్తిచేయాలని వారు కోరుతున్నారు.

విప్పలపాలెం ఆయకట్టుకు సాగునీరు విడుదల

కృష్ణాదేవిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని విప్పలపాలెం ఆయకట్టుకు చైర్మన్ గొర్లి సత్యనారాయణ మంగళవారం బొడ్డేరువిప్పలపాలెం చెక్‌డ్యామ్ గేటుఎత్తి సాగునీరు విడుదల చేశారు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ పంటలకు ఈ నీరు ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా చైర్మన్ సత్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో ఆయకట్టు మాజీ చైర్మన్ లగుడు రామ్మూర్తినాయుడు, టీడీపీ నేత అప్పలనాయడు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి చర్యలు'

నాతవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): సమస్యలను తెలిపితే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ చెప్పారు. తాండవ కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానికంగా పరిష్కారం కాని సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎ.మాణిక్యం సింగంపల్లి సన్యాసిదేముడు, అంకంరెడ్డి నానిబాబు పాల్గొన్నారు.

రాజాం-తురకలపూడి రోడ్డు మరమ్మతుకు చర్యలు

బుచ్చెయ్యపేట జూలై 15 (ఆంధ్ర జ్యోతి): మండలంలో రాజాం నుంచి తురకలపూడి వరకు రోడ్డు మరమ్మతులకు మంగళవారం అధికారులు కొలతలు వేసి అంచనా తయారు సిద్ధం చేశారు. ఈ రోడ్డు అధ్వానంగా మారడంతో జ నాలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈస్థితిలో త్వరలో ఈ రోడ్డుకు మోక్షం కలగనుండడంతో వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

నైపుణ్యంతో ఉపాధి

దేవరాపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ యువతకు నైపుణ్యం తో ఉపాధి లభిస్తుందని వక్తలు అన్నారు. ప్రపంచ నైపుణ్యం దినోత్సవం సందర్భంగా స్థానిక కేజీబీవీ విద్యార్థినులు మంగళవారం బహుళ కార్యాచరణ నిండిన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బ్యూటీ అండ్ వెల్నెస్ ఒకేషనల్ ట్రైనర్ లకే సునీత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా పనిచేయాలి

▸ మాడుగల మండల సమావేశంలో ఎమ్మెల్యే బండారు



పీఏసీఎస్ అధ్యక్షులను సత్కరించిన ఎమ్మెల్యే బండారు

మాడుగుల, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కరించే దిశగా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు పర్యవేక్షణలో జరిగిన మండల సమావేశానికి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం అధ్యక్షత వహించారు. ముందుగా బదిలీపై వచ్చిన అధికారులు పరిచయం చేసుకున్నారు. అనంతరం ఖరీఫ్ విత్తనాలు నాటినా కొన్నిచోట్ల మొలకలు రావడంలేదని పలువురు సభ్యులు ఈసందర్భంగా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సీహెచ్‌సీలో డాక్టర్ల కొరత నియంత్రణకు ఏం చర్యలు తీసుకున్నారని మాజీ ఎంపీపీ రామధర్మజ సూపరింటెండెంట్‌ను ప్రశ్నించారు.

అలాగే గ్రామాల్లో అందరికీ ఉపాధి పనులు కల్పించడంలేదని వైస్ ఎంపీపీ విజయలక్ష్మి ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ, రైతులకు పూర్తిస్థాయిలో విత్తనాలు అందించాలని ఆదేశించారు. గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయి నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహ విద్యార్థులకు దోమ తెరలు అందిస్తామన్నారు. గొర్రిగెడ్డ కాలువ పనులు ఉపాధి పథకం ద్వారా చేయించాలన్నారు. అలాగే, గ్రామాల్లో మంచినీటి పథకాల పూర్తి చేయాలని సూచించారు. ఒమ్మలితోపాటు మిగిలిన గ్రామాల్లో ఆక్రమణకు లోనైన ఆర్ అండ్‌బీ స్థలాల్లో ఆ క్రమణలు తొలగించాలని ఆదేశించారు. గ్రామాల్లో అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశించారు. అనంతరం నూతన పీఏసీఎస్ అధ్యక్షులను సన్మానించి అభినందిచారు.

మాడుగుల మహిళా మార్టుపై ఇరువర్గాల మధ్య వాగ్వాదం

వెలుగు ఏపీఎం ఎస్‌హెచ్‌జీలపై మాట్లాడారు. ఈ సమయంలో మాడుగులలో లాభాల బాటలో నడిచిన మార్టు ఇప్పుడు నష్టాల్లోకి ఎలా వచ్చిందో చెప్పాలని మాజీ ఎంపీపీ రామధర్మజ ప్రశ్నించారు. దీనిపై ఏపీఎం రమణీ కుమారి మాట్లాడుతూ రూ.31.67లక్షలతో స్టార్ట్ చేసి మహిళామార్టు 3కోట్ల టర్నోవర్ వరకు వెళ్లిందన్నారు. అనంతరం క్రమేణా రూ. 5 లక్షల అప్పుల్లో చేరిందన్నారు. ప్రస్తుతం మార్టులో రూ. 1.80 లక్షల సరకు మాత్రమే ఉన్నట్టు వివరించారు. కింతలి పీఏసీఎస్ అధ్యక్షుడు ఉందూరు దేముడు జోక్యం చేసుకుని ఒక్కో సభ్యురాలినుంచి రూ.200 చొప్పున ఈమార్టు ప్రారంభానికి వ సూలు చేశారన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడికి ఇక్కడ మాట్లాడే అర్హత లేదని మాజీ ఎంపీపీ పెదబాబు నిలదీయడంతో వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మార్టుకు సంబంధించి నివేదికను 15 రోజుల్లో త మకు ఇవ్వాలని ఏపీఎంని ఆయన ఆదేశించారు. ఎవరు తప్పు చేసినా సహించేది లేదని హెచ్చరించారు. జడ్పీటీసీ సభ్యులు కిముడు రమణమ్మ, వైస్ ఎంపీపీ పొలిమేర విజయలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ రాజా, ఎస్సై జి. నారాయణరావు, మండల పరిషత్ ఏవో గోపాలరావు, సర్పంచులు, పాల్గొన్నారు..

హెల్త్ కార్డుల ఆన్‌లైన్ వేగవంతం చేయండి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతి





చీడిగుమ్మల పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హైమావతి... మాకవరపాలెంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

గొలుగొండ/మాకవరపాలెం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హైమావతి ఆదేశించారు. మాకవరపాలెం మండల కేంద్రంతో పాటు గొలుగొండ మండలంలోని చీడిగుమ్మల పీహెచ్‌సీలను మంగళవారం ఆమె తనిఖీలు చేశారు. రోజువారీ ఓపీ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు జరిగేలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో 12 మంది వైద్యుల నియామకం జరిగిందని, త్వరలోనే వారంతా పీహెచ్‌ల్లో చేరుతారని డీఎంహెచ్‌వో తెలిపారు. మాకవరపాలెం మండలంలోని వజ్రగడ గ్రామంలో జ్వరాల పరిస్థితి ఎలా ఉందని వైద్యాధికారిని ఆరా తీశారు. పీహెచ్‌సీకి నైట్ వాచ్‌మన్ లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నామని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సీతమహాలక్ష్మి, కీర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకంలో ఆర్థిక సాయం

▸ ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి



సింగన్నదొరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న పీడీ సూర్యలక్ష్మి

కె.కోటపాడు, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మిషన్ వాత్సల్య పథకంలో 18 ఏళ్ల లోపు విద్యార్థులకు నెల వారీ విధానంలో రెండేళ్ల పాటు ఆర్థిక సాయం అందచేస్తున్నట్టు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎన్. సూర్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మండలంలోని సింగదొరపాలెం, ఎ. కోడూరు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రీ- స్కూల్, గ్రోత్ మానిటరింగ్, ఎఫ్ఆర్ఎస్, స్టాక్స్, మెడిసిన్ కిట్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో మాట్లాడారు. 18 ఏళ్ల వయసు వరకు ఇంటి నుంచి పాఠశాలల్లో చదువకునే విద్యార్థులకు రూ. 4వేల చొప్పున సహాయం అందిస్తున్నామన్నారు. పోషకహారం, రవాణా ఖర్చులు, ఆరోగ్య నిమిత్తం ఈ సహాయం అందిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లాకు 2024-2025 లో రూ.1. 42. 38వేల కోట్లు మంజూరయ్యాయన్నారు. తొలి విడతగా 332 మంది విద్యార్థులకు రూ. 19.92లక్షలను విద్యార్థుల ఖాతాలో జమ చేశామన్నారు. అలాగే మలివిడతలో 408 మందికి రూ. 1.22 కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్టు చెప్పారు. ఆమెతో పాటు సీడీపీఓ లలితకుమారి, సూపర్‌వైజర్లు సుశీల, అనిత ఉన్నారు.

గ్రామ సచివాలయ ఉద్యోగులకు సత్కారం

గొలుగొండ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న గుండుపాల గ్రామ సచివాలయ ఉద్యోగులతో పాటు హైస్కూల్ ఉపాధ్యాయులను గ్రామస్థులు మంగళ వారం ఘనంగా సత్కారించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్మయి, సర్పంచ్ జాగు రాజు, నాయకులు రామకృష్ణ, చిన్నబ్బాయి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా మూర్తిబాబు బాధ్యతలు

నాతవరం, జూలై 15 (అంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీవోగా కె.మూర్తిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటీ ఎంపీడీవోగా పని చేసిన ఎన్‌వీఎస్ఎస్.మూర్తి అల్లూరి జిల్లా డుంబ్రిగుడ మండలానికి బదిలీపై వెళ్లారు. మాడుగుల పంచాయతీ ఈవోగా పనిచేస్తూ పదోన్నతిపై మూర్తి బాబు ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

రెగ్యులర్ ఎంఈఓను నియమించాలి: యూటీఎఫ్

రావికమతం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రావికమతానికి రెగ్యులర్ ఎంఈవోను నియమించాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంజి నాగేశ్వరావు, పోలిన అప్పారావు కోరారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ ఇన్‌చార్జి ఎంఈవో తలుపులు నర్సీపట్నం మండల రెగ్యులర్ ఎంఈఓగా, అక్కడి హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్నారని, దీంతో రావికమతంపై దృష్టి సారించలేకపోతున్నారని చెప్పారు. దీనివల్ల ఉపాధ్యాయులు పలు సమస్యలపై ఇక్కడ నుంచి నర్సీపట్నం వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ ఉద్యోగులకు న్యాయం చేయండి



త్రిసభ్య కమిటీ మెంబర్, ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సుమన్ కళ్యాణికి వినతిపత్రమిస్తున్న నేతలు

చోడవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో విలీనం చేసి, అసిస్టెంట్ లైన్‌మేన్లగా పదోన్నతి కల్పించాలని విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ మెంబర్, ఈపీడీసీ ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ డి.సుమన్ కళ్యాణికి ఐక్య విద్యుత్ ఉద్యోగులు సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వేపాడ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం విశాఖలో కళ్యాణిని కలిసిన సమస్యలు వివరించారు. విద్యుత్ ఉద్యోగులు, ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న జే ఎల్ ఎం గ్రేడ్ 2 లైన్‌మేన్లకు న్యాయం చేయాలని, వారికి సర్వీస్ రూల్సు, టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆర్. సత్యారావు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, అప్పలరాజు, శంకరరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో పారిశుధ్య పనులు



పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్, ఈవోపీఆర్డీ

కృష్ణాదేవిపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏఎల్ పురంలో పారిశుద్య పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. మంగళవారం పాఠశాల ఎదుట ఆర్అండ్‌బీ రహదారి ఆనుకుని ఉన్న కాలువలో చెత్త తీయించారు. సర్పంచ్ లోచల సుజాత, ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు ఈ పనులను పర్యవేక్షించారు. పాఠశాల ఆవరణలో చెత్తా చెదారం తొలగించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జీవో 117 రద్దు చేయాలి: పీడీఎస్‌వో



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

చోడవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వచ్చిన జీవో 117 రద్దు చేసి, ప్రభుత్వ పాఠశాలలను కాపాడాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌వో ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నందారపు భాస్కర్ మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం తీసుకుని వచ్చిన జీవోను రద్దు చేయకుండా, పునర్వ్యవస్థీకరణ పేరుతో ప్రస్తుత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కుదించే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ప్రైవేటు పాఠశాలల ఫీజు దోపిడీని అడ్డుకోవాలని, హాస్టల్స్‌లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణ పేరిట తెచ్చిన జీవో 19,21లను రద్దు చేయాలన్నారు. మూసివేసిన పాఠశాలలను తెరవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీడీ ఎస్‌వో నాయకులు మజ్జి మనోజ్. కె. రామకృష్ణ, బి. గణేశ్, బి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

రావికమతం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం తిరుమల పంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న దుర్గాఫాస్ట్ ఫుడ్ సెంటర్లో మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారీ మంటలు ఎగిసిపడ్డాయి. సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పింది. గ్యాస్ స్టవ్ నుంచి సిలిండర్ కలుపుతున్న పైపులో గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగాయి. సమీపంలోని అగ్నిమాపక కేంద్రానికి సిబ్బంది సమాచారం తెలపడంతో సిబ్బంది వచ్చి సంఘటనా స్థలానికి వచ్చి మంటలు అదుపు చేశారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రచారం



జె.నాయుడుపాలెంలో ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చెయ్యపేట జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం జిల్లా కమిటి సభ్యులు వీవీ శ్రీనివాసరావు, మండల నాయకులు, ఎస్‌వీ నాయుడు ఆధ్వర్యంలో ప్రచారం సాగించారు. తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు దొడ్డిదారిన స్మార్ట్ మీటర్లు బిగిస్తుందన్నారు. ఈ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.అప్పారావు, సీరా రాజుబాబు, యేసు, చిలకబాబు పాల్గొన్నారు.

రోలుగుంట: విద్యుత్ స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోకుంటే ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని సీపీఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి హెచ్చరించారు. మంగళవారం జె.నాయుడుపాలెంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రూఅప్ చార్జీలు పేరుతో ప్రజలపై భారం వేయవద్దని డిమాండ్ చేశారు. అవసరం లేకపోయినా రూ. 38వేల విలువైన స్మార్ట్ మీటర్ భారం ప్రజలపై మోపడం సమంజంకాదన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి పరామర్శ



ప్రమాద బాధితుడితో మాట్లాడుతున్న యాదవ సంఘ నేతలు

బుచ్చెయ్యపేట జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆర్. శివరాంపురానికి చెందిన రోడ్డు ప్రమాద బాధితుడు దేవర చిలుకు నాయుడు చిలుకు నాయుడును ఉమ్మడి జిల్లా యాదవ సంఘ అధ్యక్షులు అక్కరమాని వెంకటరావు, తదితరులు మంగళవారం పరామర్శించారు. చిలుకు నాయుడు భార్య, 8నెలల చిన్నారితో బైక్ వెళ్తుండగా విశాఖలో ప్రమాద బారిన పడ్డారు. ఈ ఘటనలో చిలుకు నాయుడు భార్య కృష్ణవేణి మృతి చెందారు. దీంతో అనాథలుగా మారిన ఇద్దరు ఆడపిల్లల చదువుకు పూర్తి బాధ్యత వహిస్తానని యాదవ సంఘ నేతలు హామీ ఇచ్చారు. మండల యాదవ సంఘ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



ఎమ్మెల్యేతో పట్టణ అధ్యక్షులు ,కార్యదర్శులు

మాడుగుల జూలై 15 (ఆంధ్ర జ్యోతి): మాడుగుల పట్టణ అధ్యక్షుడుగా పుప్పాల లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా వడ్డాది గోపాల వర్మ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి సమక్షంలో నియామితులయ్యారు. ఈ పదవుల ఎంపికపై నెల రోజుల కిందట జరిగిన సమావేశంలో మాదిగల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో నియోజకవర్గ పరిశీలకులు నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు స్వీకరించారు. అయినా సమస్య కొలిక్కిరాలేదు. ఈ స్థితిలో మంగళవారం ఎమ్మెల్యే సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో అభిప్రాయాలు సేకరించారు. అనంతరం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, లెక్కల కాశీబాబు, డిల్లీ నానాజీ, జోన్నపల్లి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంట్‌తో నష్టం



ప్లాంటు అనుమతులు రద్దు చేయాలని గిరిజనులు నిరసన

దేవరాపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అదానీకి చెందిన కంపెనీ చేపట్టనున్న హైడ్రో పవర్ ప్లాంట్ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు బృందంతో కలసి మారిక, సమ్మెద, తామరబ్బ పల్లపు కొడాబు, రై వాడ జలాశయ పరిధిలో గ్రామాలను మంగళవారం సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పవర్ ప్లాంట్‌కు అనుమతులు ఇస్తే గిరిజన గ్రామాలు, జలాశయాలకు తీవ్ర ము ప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లి దేముడు, సీపీఐ మండల కార్యదర్శి వేమల కన్నబాబు, దొమ్మంగి బోడమ్మ, వీరన్నదొర పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో తైలేరియా వ్యాక్సినేషన్

దేవరాపల్లి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి, ఎం. అల మండ గ్రామాల్లో తైలేరియా వాక్సినేషన్ కార్య క్రమం నిర్వహించినట్టు పశువైద్యాధికారి జి.గాయత్రీదేవి మంగళవారం తెలిపారు. ఈసీజన్‌లో పశువులకు దోమ కాటువల్ల ఈవ్యాధి సోకుందన్నారు. ఈ వ్యాధి సోకిన జీవాలకు జ్వరం, నీరసం, ఉంటుందన్నారు. పాలు దిగుబడి తగ్గిపోతుందన్నారు. వ్యాధి నివారణ కొరకు టీకాలు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సురేశ్, ఎర్రిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

రెండు సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు

దేవరాపల్లి, జూలై 15 (అంధ్రజ్యోతి): మండలంలో పీఎసిఎస్‌లకు ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను నియమించింది. ఎం.అలమండ పీఏసీఎస్ చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన గొర్లె గోవింద, సభ్యులుగా యాళ్ల అప్పలనాయుడు బొడ్డు వెంకటరావుని నియమించారు. ములకలాపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా చామంతుల సన్యాసిరావు, సంఘ సభ్యులుగా సోమేశ్వరరావు, రొంగలి గోవిందరావు, నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

'హామీల అమలులో విఫలం'



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. 'బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ'పై స్థానిక ఓ కల్యాణమండపంలో మంగళవారం వైసీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంలో 65ఏళ్లకు పింఛన్ మంజూరుచేస్తే జగన్ ప్రభుత్వంలో 60 ఏళ్లకే పింఛన్లు మంజూరు చేశారన్నారు. 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పింఛన్లు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు 14 నెలలైనా ఒక్క పింఛన్ కేటాయించలేదన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను అమలు చేయడంలేదన్నారు. రైతుభరోసా, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయలేదని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసీపీ కార్యకర్తలకు ఆదేశించారు. వైసీపీ మండల అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, ఎంపీపీ కురచా జయమ్మ, సీడీసీ చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, నాయకులు గొల్లవిల్లి స్వామినాయుడు, చుక్క అప్పలనాయుడు, కసిరెడ్డి రామకృష్ణ, పరవాడ రామారావు, పుట్టా రామ్‌కుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్సలెన్స్ సేవలు షురూ..

విశాఖపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో మానసిక సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఏటా కొన్ని లక్షల మంది మానసిక సమస్యల బారినపడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మానసిక రోగులకు అవసరమైన కౌన్సెలింగ్, వైద్య సేవలందించే నిపుణుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. భవిష్యత్తులో పెరగనున్న మానసిక సమస్యలకు మెరుగైన వైద్య సేవలందించే నిపుణుల సంఖ్యను పెంచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మానసిక ఆస్పత్రులను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అభివృద్ధి చేసే కార్యక్రమానికి ఎనిమిదేళ్ల కిందట శ్రీకారం చుట్టింది. దేశంలోని 26 ప్రభుత్వ మానసిక ఆస్పత్రులను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అప్‌గ్రేడ్ చేయగా.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో ఉన్న మానసిక ఆస్పత్రిని కూడా ఇందుకోసం ఎంపిక చేసింది. అప్‌గ్రేడేషన్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో సుమారు రూ.29.70 కోట్లు వెచ్చించి అధునాతన భవనాలను నిర్మించారు. ఈ భవన నిర్మాణాలు పూర్తయిన రెండేళ్ల తరువాత మంగళవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు.

- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మానసిక ఆస్పత్రి అప్‌గ్రేడేషన్‌తో మరిన్ని మెరుగైన సేవలు
- దేశవ్యాప్తంగా 26 ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేసిన కేంద్రం
- ఏపీలో విశాఖ ఆస్పత్రికే అవకాశం
- నాలుగు కోర్సుల నిర్వహణతో అందుబాటులోకి రానున్న మానసిక నిపుణులు

దీంతో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సేవలు అందించే దిశగా కీలకమైన అడుగు పడినట్టయింది. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా పూర్తి స్థాయిలో సేవలందించే స్థితికి చేరుకుంటే మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించడంతోపాటు సమాజానికి అవసరమైన మానసిక నిపుణులు ఇక్కడ నుంచి రానున్నారు.

మానసిక రోగులకు భరోసా..

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అప్‌గ్రేడేషన్ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే మానసిక సమస్యలతో బాధపడే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు అవకాశం ఉంది. ఆస్పత్రిలో అదనంగా 80 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో వృద్ధులకు 20, చిన్నారులకు 20, వ్యసన విముక్తికి సంబంధించి మరో 40 పడకలు ఉంటాయి. ఇందుకోసం చైల్డ్ సైకియాట్రీ, జీరియాట్రిక్ బ్లాక్, డీ-అడిక్షన్ వార్డు, రీహాబిలిటేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ విభాగాల్లో పని చేసేందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించుకోనున్నారు.



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ మెంటల్ కేర్ భవనం. (ఇన్‌సెట్లో) మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి

కోర్సులతో నిపుణులు..

సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భాగంగా పారా సైకాలజీ కోర్సులను నిర్వహించనున్నారు. సైకియాట్రిక్ నర్సింగ్, క్లినికల్ సైకాలజీ, సైకియాట్రిక్ సోషల్ వర్క్ విభాగాలు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో విభాగంలో 30 మందికి ప్రవేశాలు కల్పించి కోర్సులను నిర్వహించనున్నారు. ఈ కోర్సుల ద్వారా రెండేళ్లకొకసారి ఆయా విభాగాలకు చెందిన నిపుణులు 30 మంది చొప్పున అందుబాటులోకి వస్తారు. వీరిద్వారా అనేక మంది మానసిక రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. ఈ కోర్సుల నిర్వహణకు రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్ సీఐ) అనుమతి కావాలి. ఇప్పటికే ఎన్ టీఆర్ విశ్వవిద్యాలయం, డీఎంఈ అధికారులకు ఆస్పత్రి అధికారులు కోర్సుల నిర్వహణకు అనుమతి ఇవ్వాలంటూ కోరారు. ఉన్నతాధికారులు ఆర్‌సీఐ నుంచి అనుమతి తీసుకున్న వెంటనే ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. కోర్సుల నిర్వహణకు అనుగుణంగా నిపుణులు అందుబాటులో ఉన్నారని, వీరి ద్వారా రెండు కోర్సులను నిర్వహించుకునే సామర్థ్యం కలిగి ఉన్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. ఇదే విషయాన్ని మంత్రికి తెలియజేశామని, కొద్ది రోజుల్లోనే కోర్సుల నిర్వహణకు అనుమతి లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్లు జైలు శిక్ష

పాయకరావుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో 2022లో ఒక బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నేరం రుజువుకావడంతో ముద్దాయికి రెండు సెక్షన్ల కింద చెరో మూడేళ్ల జైలు శిక్షను న్యాయమూర్తి విధించారు. మంగళవారం పాయకరావుపేట సీఐ జి.అప్పన్న అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని శ్రీరాంపురంలో 2022 జూన్ 17వ తేదీ రాత్రి ఒక బాలిక ఇంట్లో నిద్రిస్తుండగా తెల్లవారుజామున అదే గ్రామానికి చెందిన బి.ఆనంద్‌కుమార్ ఇంటి వెనుక వైపు నుంచి బాలిక నిద్రిస్తున్న గదిలోకి చొరబడి అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై పోక్సో కేసు నమోదు చేశారు. విశాఖపట్నం పోక్సో కోర్టులో కేసుపై వాదోపవాదనలు జరిగాయని, నేరం రుజువుకావడంతో పోక్సో చట్టం కింద ముద్దాయి బి.ఆనంద్‌కుమార్‌కి మూడేళ్లు సాధారణ జైలు శిక్ష, రూ.25 వేలు, అదే విధంగా ఐపీసీ సెక్షన్ కింద మూడేళ్ల సాధారణ జైలు, వెయ్యి రూపాల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారని సీఐ అప్పన్న తెలిపారు. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా రూ.25 వేలు బాధిత బాలికకు నష్టపరిహారంగా ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించారని సీఐ అప్పన్న తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య

చదువుకునేందుకు ఆర్థిక సమస్య అడ్డంకిగా మారడమే కారణం

గోపాలపట్నం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): చదువుకు ఆర్థిక సమస్యలు అడ్డంకిగా మారడంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ దుర్ఘటన మంగళవారం రాత్రి గోపాలపట్నంలోని ఇందిరానగర్‌లో చోటుచేసుకుంది. ఇందిరానగర్‌కు చెందిన వానపల్లి శృతి కీర్తన (18) ఇటీవల డిప్లొమా పూర్తిచేసింది. ఏపీఈసెట్‌లో 300 ర్యాంకు సాధించిన ఆమెకు ఇంజనీరింగ్‌లో చేరడానికి ఫ్రీ సీటు రాలేదు. కీర్తన తండ్రి సెల్‌ఫోన్ మెకానిక్‌గా పనిచేస్తున్నారు. ఉన్నత చదువులు చదవాలన్న కుమార్తె ఆసక్తిగా గమనించిన ఆయన ఎలాగైనా ఇంజనీరింగ్‌లో చేర్పించాలని కొద్దిరోజులుగా అప్పు కోసం ప్రయత్నిస్తున్నారు. మంగళవారం ఉదయం కొంత అప్పు చేశారు. అయితే తన చదువు కోసం తండ్రి అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతారని భావించిన కీర్తన మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పనిమీద బయటకు వెళ్లిన ఆమె తల్లిదండ్రులు రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి వచ్చారు. ఎంత పిలిచినా కుమార్తె తలుపులు తెరవకపోవడంతో బలవంతంగా వాటిని తెరిచారు. లోపల కీర్తన ఉరి వేసుకుని కనిపించడంతో విలపిస్తూ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు గోపాలపట్నం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కీర్తన ఆత్మహత్యకు కారణాలపై వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం ఇమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా ప్రమాదాల్లో వారే బలి

... 3వ పేజీ తరువాయి

తప్పనిసరి అని స్పష్టంచేసింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా జీఓ జారీచేసింది. దీనిని అమలు చేయాల్సి ఉంది.

ఫార్మా కంపెనీల్లో పొగ వచ్చినా, మంట వచ్చినా, రసాయనాల వాసన వచ్చినా వాటిని పసిగట్టి హెచ్చరించే సెన్సార్లు ఉంటాయి. అయితే ప్రమాదాలు జరిగినా యాజమాన్యాలు కొన్నింటిని కప్పిపుచ్చడం, వాస్తవాలు వెల్లడించకపోవడం జరుగుతోంది. ఇకపై అలాంటి వాటికి అవకాశం లేకుండా సెన్సార్లు అన్నింటినీ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)కి కనెక్ట్ చేయాలని ఫ్యాక్టరీస్ విభాగం ఆదేశించింది. వాటిని ఎమర్జన్సీ కాల్ సెంటర్‌తో పాటు ఫార్మా సిటీలోని అసోసియేషన్ భవనం(ఎంఏఎస్‌ఆర్‌ఎం)కు కూడా అనుసంధానం చేయాలని అధికారులు ఆదేశించారు. అలాగే ఏపీఐఐసీకి కూడా ఆ సమాచారం వెళ్లేలా చూడాలని సూచించారు. దీనివల్ల ఎటువంటి ప్రమాద సమాచారమైనా తక్షణమే కంపెనీ బయట ఉండే వారికి కూడా వెళ్లి, వెంటనే సహాయక చర్యలు చేపట్టడానికి వీలుంటుంది.

ఉచిత విద్యుత్‌కు రూ.వేలల్లో బిల్లులా?

... 3వ పేజీ తరువాయి

డిమాండ్ చేశారు. సబ్‌స్టేషన్ వద్ద డిమాండ్ నోటీసులను దహనం చేశారు. అనంతరం బిల్లులు రద్దు చేయాలని, మీటర్లు తొలగించాలని కోరుతూ ఏఈ జగదీస్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు ఆళ్ళ మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజి, రైతులు పాల్గొన్నారు.

సుంకపూర్‌లో ప్రపంచబ్యాంకు బృందం పర్యటన

- పెదచెరువును పరిశీలించిన బృందం



సుంకపూర్ పెద్ద చెరువు వద్ద ఆయకట్టు రైతులతో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు



మొక్కను పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు

కోటవురట్ల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకపూర్‌లో మంగళవారం ప్రపంచ బ్యాంకు బృందం పర్యటించింది. గ్రామంలోని పెద్ద చెరువును బృందం సభ్యులు చికవ్ అమడౌవ్ టిడినే దియా, వెంకట్రావు బయాన పరిశీలించారు. ఈ చెరువుకు ఏపీ సమీకృత నీటిపారుదల వ్యవసాయం పరివర్తన ప్రాజెక్టు భాగంలో వరల్డ్ బ్యాంకు 2019లో రూ.97లక్షలు మంజూరు చేసింది. ఈ నిధుల్లో రూ.27లక్షలతో పెద్దచెరువుకు పొర్లుకట్టు ఎత్తు పెంచడం, మదములకు మరమ్మతులు చేశారు. అయితే అప్పట్లో చేసిన అభివృద్ధి పనులు రైతులకు ఉపయోగకరంగా చేశారా? లేదా? అనే కోణం ప్రపంచబ్యాంకు బృందం ఆరా తీసింది. పొర్లుకట్టు ఎత్తు పెంచడం ద్వారా చెరువు గర్భంలో సాగు నీటి నిల్వ శాతం పెరిగిందాని రైతులు అడిగి తెలుసుకున్నారు. మిగిలిన నిధులతో ఎటువంటి పనులు చేస్తే రైతులు ఉపయోగంగా ఉంటుందని అని రైతు బాబ్జీని వారు ప్రశ్నించారు. రైతులు మాట్లాడుతూ చెరువు నుంచి పంట పొలాలకు వచ్చే పిల్ల కాలువలు సిమెంట్ లైనింగ్ చేస్తే సాగునీటి వృథాను పూర్తిగా తగ్గించవచ్చునన్నారు. గతంలో చేసిన అభివృద్ధి పనులు రైతులకు ఉపయోగకరంగా ఉండడంతో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు సంతృప్తివ్యక్తం చేశారు. అనంతరం బృందం ప్రతినిధులు రైతులతో గ్రామంలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక రైతులు ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు, కూరగాయలు, జీవామృతం స్టాల్‌ను ప్రపంచ బ్యాంకు బృందం ప్రతినిధులు పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. డ్రోన్ల వినియోగంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఏపీఐఐఏటీపీ ఎస్ఈ ఎంఎస్‌వీ వేణుగోపాల్, గ్రౌండ్‌వాటర్ జేడీ కేఎస్ శాస్త్రీ, హార్టికల్చర్ డీడీ సుబ్బారావు, ఈఈ టీఎం రేవతి, ఇరిగేషన్ డీఈఈ రాజేంద్ర ప్రసాద్, సాగునీటి సంఘం అధ్యక్షుడు లాలం అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ సీహెచ్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే భారత రాజ్యాంగం గొప్పది

- డీఎస్ఎన్ఎల్‌యూ వ్యవస్థాపక ఉపకులపతి ప్రొఫెసర్ వై సత్యనారాయణ

సబ్బవరం, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే భారత రాజ్యాంగం గొప్పదని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఉప కులపతి ప్రొఫెసర్ వైసత్యనారాయణ అన్నారు. వర్సిటీలో మొదటి సంవత్సరం విద్యార్థులకు 'భారత రాజ్యాంగం.. ముఖ్య లక్షణాలు' అనే అంశంపై సోమవారం ఆయన ప్రత్యేక ఉపన్యాసాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రాథమిక సూత్రాలు, ప్రత్యేక లక్షణాల గురించి వివరించారు. అనేక జాతులకు, కులాలకు, వర్గాలకు సంబంధించిన హక్కులను, స్వేచ్ఛను పరిరక్షించేందుకు రాజ్యాంగం రూపొందించబడిందన్నారు. అందుకే ఏ దేశ రాజ్యాంగంతో పోల్చినా భారత రాజ్యాంగం గొప్పదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బీఎన్ రావుతోపాటు అనేక మంది న్యాయ కోవిదులు ఒక సమగ్రమైన రాజ్యాంగం రూపొందించారన్నారు. కొత్తగా చేరిన న్యాయ విద్యార్థులు భారత రాజ్యాంగాన్ని పోషణ పట్టాలన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ డి సూర్యప్రకాశరావు, అకాడమిక్ డీన్ సోమా భట్టాచార్య, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

- ఏడుగురిపై కేసు నమోదు

పరవాడ, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలపాక గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరం పై మంగళవారం దాడి చేసినట్టు పరవాడ ఎస్ఐ కృష్ణారావు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. ఈ దాడిలో రూ. 8,430 నగదుతో పాటు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణారావు తెలిపారు.

కౌలు రైతులకు తప్పని కష్టాలు

... 3వ పేజీ తరువాయి

జిల్లాలో కౌలు రైతులు 75 వేల మందికి పైగా ఉన్నారని అంచనా. కాగా అధికారులు మాత్రం కేవలం కొద్ది మందికే కార్డులు అందజేసేందుకు ఏటా ప్రతిపాదనలు రూపొందించడం, వారికి కూడా రకరకాల నెపంతో పూర్తి స్థాయిలో కార్డులు అందజేయకపోవడం పరిపాటిగా మారిపోయింది. కౌలు రైతులకు కార్డులు అందకపోవడంతో వారు నష్టపోతున్నారు. ప్రభుత్వం రాయితీపై అందించే విత్తనాలు, ఎరువులు పొందలేకపోతున్నారు. కార్డులున్న రైతులు తమ పంట ఉత్పత్తులను అమ్ముకొనే అవకాశం ఉంది. కానీ కార్డులు లేకపోవడం వల్ల కౌలు రైతులు పంట దిగుబడులను దళారులకు విక్రయించుకోవలసి వస్తోంది.

వాహనాల ఫిట్‌నెస్‌కు పాట్లు

... 3వ పేజీ తరువాయి

చెబుతున్నారు. చలానాకి అయ్యే ఖర్చుతో పాటు అదనంగా మరో రూ.1500 ఖర్చు అవుతోందని వాపోతున్నారు. రోజంతా పని పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం ఆర్టీవో కార్యాలయం పరిధిలో ఒక ఏటీఎస్ ఏర్పాటు చేస్తే ఏజెన్సీ మండలాలకు, నర్సీపట్నం చుట్టు పక్కల గ్రామాల వాహనదారులకు వెసులుబాటుగా ఉంటుందని ఆటో యజమానులు ఎన్.రాజు, ఎస్‌కే.అమీర్, ఆర్.దుర్గాప్రసాద్ తెలిపారు.

ఆర్టీసీ బస్టాండ్ల నిర్వహణ అధ్వానం

... 3వ పేజీ తరువాయి

బస్టాండ్‌లో ప్రయాణికులకు దుర్వాసన తప్పడం లేదు. సబ్బవరం బస్టాండ్‌లో ప్రయాణికులు వేచి వుండేందుకు బల్లలు లేవు, ఫ్యాన్‌లు గతంలో ఉన్నవి తొలగించారు. ప్రస్తుతం ఒక్క ఫ్యాన్ కూడా లేదు. జిల్లాలో బస్టాండ్‌ల ఆధునికీకరణ మాట అటుంచితే ఇప్పటికైనా జిల్లా అధికారులు మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు. అనకాపల్లి జిల్లాలో ఆర్టీసీ బస్టాండ్‌లలో నెలకొన్న సమస్యలపై జిల్లా అధికారి ప్రవీణ మాట్లాడుతూ ఇటీవలే బదిలీపై జిల్లాకు వచ్చానని, డిపోలు, బస్టాండ్‌లలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా

పంటకుంటలో ఇద్దరు బాలురు మృతి

హుకుంపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా ఇద్దరు బాలుర ప్రాణాలు తీసింది. ఈ విషాద ఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం గడికించుమండ పంచాయతీ గడ్డిమర్రి గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గడికించుమండ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న గెమ్మెలి అఖిల్ (8), గెమ్మెలి సంతోశ్ (8)లు మంగళవారం సాయంత్రం పాఠశాల విడిచిపెట్టిన తరువాత సమీపంలోనే ఉన్న స్వగ్రామం గడ్డిమర్రికి చేరుకున్నారు. అయితే ఆ సమయంలో వాళ్ల తల్లిదండ్రులు పొలం పనుల్లో ఉండడంతో బాలురు అక్కడకు బయలుదేరారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో ఉన్న పంటకుంటలో ఈత కోసం దిగారు. ఇటీవల కురిసిన భారీవర్షాలకు పంటకుంటలో నీళ్లు అధికంగా ఉండడంతో అఖిల్, సంతోశ్‌లు మునిగిపోయారు. దీనిని గమనించిన స్థానికులు వారిద్దరినీ కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం దక్కలేదు. నీటిలో మునిగిపోయి ఊపిరాడక బాలురు ప్రాణాలు కోల్పోయారు. అనుకోని విధంగా ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు పిల్లలు మృతి చెందడంతో గడ్డిమర్రి గ్రామంలో విషాదం అలముకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై ఆరా

... 3వ పేజీ తరువాయి

చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే పంచాయతీలో ఈ ఏడాది కాలంలో వచ్చిన నిధులు, వాటిని దేనికి ఉపయోగించారు అనే విషయాలను ఆయన అంశాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా బ్లీచింగ్, సున్నం కొనుగోళ్లు, పారిశుధ్యం పనులు, విద్యుత్ సామగ్రి కొనుగోళ్లు, వీధి దీపాల నిర్వహణకు వ్యయం పేరిట చూపించిన నిధులకు సంబంధించి రికార్డులు పరిశీలించాలని ఎండీవోకు సూచించారు. పంచాయతీలో పారిశుధ్య సిబ్బందికి వేతనాలు చెల్లించడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఎండీవో ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సర్పంచ్ నూకరత్నం పాల్గొన్నారు.

క్రైం... crime news

బిడ్డతో సహా తల్లి ఆత్మహత్య

- తల్లి మృతి.. బిడ్డ క్షేమం
- ఇష్టంలేని వివాహమే కారణం

ఎలమంచిలి, జూలై 15 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల చిన్నారిని చంకలో పెట్టుకుని తల్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న దారుణ ఘటన ఎలమంచిలిలో చోటుచేసుకుంది. ఎలమంచిలి పట్టణంలోని దిమిలి రోడ్డులో ఉన్న పాతవీధిలో సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటన గురించి స్థానికులు, పట్టణ ఎస్ఐ సావిత్రి అందించిన వివరాలిలా ఉన్నాయి. రాంబిల్లి మండలం పెద్ద కలవలాపల్లికి చెందిన సలాది కోటిబాబు, నూకరత్నం చిన్న కుమార్తె రూపను నాలుగేళ్ల క్రితం ఎలమంచిలి పాతవీధికి చెందిన గుంటుకు రాజుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి మూడున్నరేళ్ల కుమారుడు, రెండేళ్ల కుమార్తె ఉన్నారు. రాజు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం సాయంత్రం రూప మేడపై ఉన్న రూమ్‌లోకి వెళ్లి తన రెండేళ్ల కుమార్తెను చంకలో పెట్టుకుని ఉరేసుకుంది. చిన్నారి ఏడుపు విని బంధువులు, స్థానికులు మేడపైకి వెళ్లి చూసేసరికి రూప అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ ఉపేంద్ర, పట్టణ ఎస్ఐ సావిత్రి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి 9 గంటలకు మృతురాలి తల్లి సలాది నూకరత్నం తన కుమార్తె ఆత్మహత్యపై ఫిర్యాదు చేసిందని ఎస్ఐ సావిత్రి తెలిపారు. తన కుమార్తెకు ఈ వివాహం ఇష్టం లేదని అప్పుడప్పుడూ బాధపడుతూ ఉండేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన అల్లుడు ఫోన్ చేసి చెప్పడంతో వచ్చానన్నారు. తన కుమార్తెను అత్తింటి వారు సక్రమంగా చూసుకునేవారని మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 174 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మంగళవారం తహశీల్దార్ వరహాలు పంచనామ నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు పట్టణ ఎస్ఐ సావిత్రి తెలిపారు.

చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

మునగపాక, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వృత్తిరీత్యా చెట్టు ఎక్కిన గీత కార్మికుడు ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. మండలంలో నాగులాపల్లి గ్రామానికి చెందిన రంగాల గురువునాయుడు(42) మంగళవారం కాయలు తీసేందుకు కొబ్బరి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు కింద పడిన గురువునాయుడును అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు గురువునాయుడుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని ఆదుకోవాలని గీత కార్మికులు కోరారు.

వ్యాన్, ఆటో ఢీ : ఒకరికి గాయాలు

పాయకరావుపేట, జూలై 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక నర్సీపట్నం జంక్షన్ వద్ద మంగళవారం తుని నుంచి అనకాపల్లి వెళుతున్న వ్యాన్‌ని ఐరన్ చువ్వల లోడ్‌తో వెళుతున్న గూడ్స్ ఆటో ఢీకొట్టి రోడ్డుపై బోల్తా పడిపోయింది. ఈ సంఘటనలో ఆటో డ్రైవర్‌కి గాయాలవగా చికిత్స కోసం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆటో తొట్టిలో ఉన్న ఐరన్ చువ్వలు రోడ్డు పడిపోవడంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది, పోలీసులు రోడ్డు ఆటోను, ఇనుప చువ్వలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు.

అనకాపల్లి జిల్లా నుంచి గంజాయి అక్రమ రవాణా

- వినియోగం, విక్రయాలు
- ఐదుగురు యువకుల అరెస్టు

గొల్లప్రోలు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నుంచి గంజాయిని అక్రమంగా తీసుకువచ్చి వినియోగించడమే గాక విక్రయిస్తున్న ఐదుగురు యువకులను కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల్లో ఒక బాలుడు, మిగిలిన వారు 19-23 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు. గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ వెల్లడించారు. గొల్లప్రోలు పట్టణ శివారు ఈబీసీ కాలనీ దాటిన తర్వాత ఉన్న ఒక ప్రైవేటు లే-అవుట్‌లో గంజాయి విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సీఐ, ఎస్ఐ మంగళవారం ఆకస్మికంగా దాడి చేశారు. ఆ సమయంలో నలుగురు యువకులు గంజాయిని వాటాలుగా వేసుకుంటుండగా గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహించగా.. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో గంజాయి సరఫరా చేసే వ్యక్తి నుంచి గంజాయి తీసుకువచ్చి తమ వినియోగానికి కొంత ఉంచుకుని మిగిలిన దానిని అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు వెల్లడైంది. ఈ సంఘటనకు సంబంధించి కాకినాడ రేచర్లపేటకు చెందిన కడియపు ప్రేమ్‌కుమార్, మరో బాలుడు, నక్కపల్లి మండలం రాజంపేట గ్రామానికి చెందిన మద్దు లోకేష్, పిఠాపురం మంగాయమ్మరావుపేటకు చెందిన ధనాల మనోహర్, కొత్తపల్లి మండలం మూలపేట గ్రామానికి చెందిన రామిశెట్టి దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి, ఒక మోటారు సైకిలు స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరుస్తామని సీఐ చెప్పారు.

ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలు

- పోలీసులకు పట్టుబడిన అనకాపల్లికి చెందిన మహిళ

పలాస, జూలై 15 (ఆంధ్రజ్యోతి): బస్సులు, రైళ్లు, ఆటోల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న ఓ మహిళ శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ పోలీసులకు సోమవారం రాత్రి పట్టుబడింది. ఆమె నుంచి రూ.6.5 లక్షల విలువైన ఆరు తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మంగళ వారం కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు విలేకరులతో మాట్లాడారు. పలాసకు చెందిన రోహిణి జూన్ నాలుగో తేదీన శ్రీకాకుళం నుంచి బస్సులో పలాస వస్తుండగా బ్యాగు దొంగతనానికి గురైందని కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ బస్టాండు, రైల్వే స్టేషన్, ఆటో స్టాండ్‌పై నిఘా పెట్టారు. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన సమాచారాన్ని సేకరించగా దొంగతనం చేసింది మహిళ అని గుర్తించారు. దీంతో ఆమె కోసం వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో అనకాపల్లికి చెందిన పరుపల్లి దుర్గను సీసీ కెమెరాల ద్వారా గుర్తించి పట్టుకున్నారు. పోలీసులు ప్రశ్నించడంతో టెక్కలిలో బస్సు ఎక్కినట్టు చెప్పింది. రోహిణి హడావుడిలో దిగుతున్న సమయంలో ఆమె పర్సును దొంగిలించినట్లు దుర్గ అంగీకరించింది. బ్యాగులో ఆరు తులాల బరువున్న రెండు బంగారు హారాలు ఉన్నాయి. పరుపల్లి దుర్గపై అనేక కేసులు గతంలో నమోదయ్యాయి. దీంతోపాటు ఆమె జైలు జీవితాన్ని కూడా అనుభవించింది. శ్రీకాకుళం రెండో పట్టణ, గాజువాక, అనకాపల్లి పోలీస్‌స్టేషన్, అనకాపల్లి రైల్వే పోలీస్ స్టేషన్, నర్సీపట్నం, చోడవరం, నెల్లిమర్లతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పలు పోలీస్‌స్టేషన్లలో ఆమెపై నేరారోపణలు ఉన్నాయి. ఈ మేరకు దుర్గను పలాస కోర్టులో హాజరుపరిచారు. కేసును ఛేదించిన సీఐ పి.సూర్యనారాయణ, సిబ్బందికి డీఎస్పీ అభినందించారు.

సైబర్ క్రైమ్‌పై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, జూలై 15 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్‌లో తప్పుడు సమాచారమిచ్చి రూ. 25వేలు కాజేసిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక నరసింగరావుపేటకు చెందిన వాస రజిని హైదరాబాద్‌లో ఉంటున్నారని, అమెరికాలో ఉంటున్న ఆమె చెల్లెలు రాధ పేరు మీద నమ్మించి గుర్తు తెలియని వ్యక్తి రూ. 25వేలు కావాలని ఏప్రిల్ 28వ తేదీన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడన్నారు. నిజమని అనుకొని ఆ పోస్ట్ చేసిన వ్యక్తికి రజిని రూ. 25వేలు ఆయన అకౌంట్‌లో బదిలీ చేసిందన్నారు. చెల్లెతో సంప్రదించిన తర్వాత అసలు విషయం తెలుసుకున్న రజిని సైబర్ క్రైమ్‌గా భావించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	70.00
లైవ్ ధర	90.00
విత్ స్కిన్	150.00
స్కిన్ లెస్	160.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544